# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :252 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 17-12-2025 | పేజీలు:4 వెల: 2.00


## తవ్వకాల్లో బయటపడ్డ అమ్మవారి విగ్రహం

మంచిర్యాల, మంచిర్యాల జిల్లాలో తవ్వకాల్లో అమ్మవారి విగ్రహం బయటపడింది. గోదావరి పరిక్రమ యాత్రలో భాగంగా నేలమాలిగ గ్రామానికి వచ్చిన స్వామిజీలు చెప్పిన మాట మేరకు సోమవారం తవ్వకాలు జరపడంతో దుర్గాదేవి విగ్రహం కనిపించింది. ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన ఈ తవ్వకాలను చూసేందుకు జనాలు భారీగా తరలివచ్చారు. తవ్వకాలు జరుపుతున్న సమయంలో కొంతమంది భక్తులు పూనకాలతో ఊగిపోయారు. గోదావరి పరిక్రమ యాత్రలో భాగంగా ఈ నెల 12వ తేదీన మంచిర్యాల జిల్లాకు అయోధ్యలోని శ్రీరామమందిరంలోని పూజారితో పాటు వారణాసి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పీఠాధిపతులు, పలువురు స్వాములు వచ్చారు. ఈ సందర్భంగా ముల్కల మండలం నేలమాలిగలోని గోదావరి తీరంలో పుష్కరఘాట్‌కు వెళ్లే మార్గంలోని ఓ ప్రదేశాన్ని చూపించి, అక్కడ ఏదో తెలియని శక్తి ఉందని తెలిపారు. దీనికి సంబంధించిన వీడియోలు ఇటీవల సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో స్థల యజమాని అనుమతి తీసుకున్న స్థానికులు, ఇవాళ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తవ్వకాలు జరిపారు.

## దాడికి ప్రతిదాడి అనే పరిస్థితే వస్తే తామూ తిరగబడతాం: కేటీఆర్



హైదరాబాద్: గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణమని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలు పోతుంటే పోలీసులు చేష్టలుడిగి చూడటం పద్ధతి కాదన్నారు. పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోకపోతే తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా సోమార్‌పేట్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బిట్ల బాలరాజు, అతని భార్య గంజి భారతిని కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి, వైద్య ఖర్చులు పార్టీనే భరిస్తుందని.. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాలు ఇష్టమొచ్చినట్టు దాడులకు తెగబడుతుంటే.. పోలీసులు నిశ్చేష్టులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై చర్యలు తీసుకోకపోతే తాము కూడా తిరగబడాల్సి వస్తుందన్నారు. ఇక దాడికి ప్రతిదాడే సమాధానం అనుకుంటే, రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, అప్పుడు జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.రాష్ట్రంలో పోలీసులు వ్యవహరిస్తున్న అత్యంత దారుణంగా ఉందన్నారు. డీజీపీ స్థాయి నుంచి కిందిస్థాయి పోలీస్ అధికారుల వరకు అందరికీ గుర్తు చేస్తున్నా.. మీకు జీతాలు ఇస్తున్నది ప్రజల సొమ్ముతోనే. రేవంత్ ఇంట్లో సొమ్ముతోనే, కాంగ్రెస్ సొమ్ముతోనే కాదు. ప్రజల ప్రాణాలు పోతుంటే పోలీసులు చేష్టలుడిగి చూడటం పద్ధతి కాదని హెచ్చరించారు. భారతి, బాలరాజులపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదుచేయాలన్నారు. ఆస్పత్రి పాలైన వారి కుటుంబాని ఆర్థిక సహాయం, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.రెండేండ్లుగా బీఆర్ఎస్ కార్యకర్తకలపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. సూర్యాపేట, నల్లగొండలో బీఆర్ఎస్ అభ్యర్థులపై దాడి చేసి మూత్రం తాగించారన్నారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ కార్యకర్త మల్లయ్య యాదవ్‌ను కాంగ్రెస్ గూండాలు హత్య చేశారు, ఇంకో బీసీ సోదరుడి భార్య నామినేషన్ వేస్తే, అతడిని కిడ్నాప్ చేసి కోమటిరెడ్డి అనుచరులు చిత్ర హింసలు పెట్టారన్నారు. ఇన్ని అరాచకాలు జరిగినా పోలీసులు ఇప్పటికీ కేసు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవన్నీ గుర్తుపెట్టుకుంటున్నామని, పోలీసులు డ్యూటీ సరిగ్గా చేయకపోతే తామే డ్యూటీ చేస్తామన్నారు. దాడికి ప్రతిదాడి అనే పరిస్థితే వస్తే తాము కూడా తిరగబడతామన్నారు. కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్ర గాయాల పాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భారతి, బాలరాజ్ కుటుంబానికి, ఇతర కార్యకర్తలకు అయ్యే పూర్తి వైద్య ఖర్చులను పార్టీనే భరిస్తుందని చెప్పారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని.. దాడికి తెగబడ్డ కాంగ్రెస్ గూండాలను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే డీజీపీ, ఎస్పీ కార్యాలయాల ముట్టడికైనా పిలుపునిస్తామన్నారు. న్యాయం జరిగే వరకు పోరాడుతామని చెప్పారు. సీఎం తన భాషతో కార్యకర్తలను రెచ్చగొట్టడం మానుకోవాలని, జరగబోయే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

## కవిత ఎఫెక్ట్..ఐడీపీఎల్ భూములపై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు




హైదరాబాద్ : ఐడీపీఎల్ భూముల ఆక్రమణలపై రేగిన రాజకీయ వివాదం అనూహ్య మలుపుతిరిగింది. సుమారు రూ. 4 వేల కోట్ల విలువైన ఐడీపీఎల్ భూములపై విజిలెన్స్ విచారణకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. సర్వే నెంబర్ 376లో ఐడీపీఎల్ భూ వివాదాలలో నిజానిజాల నిగ్గు తేల్చాలంటూ సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ బహిష్కృత ఎమ్మెల్సీ కవిత, కూకట్ పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు తాజాగా ఐడీపీఎల్ భూములకు సంబంధించి పరస్పర ఆరోపణలు సంధించుకోవడంతో ఈ భూముల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఎమ్మెల్యే మాధవరం, ఆయన కుమారుడు ఈ భూములను ఆక్రమించారని కవిత ఆరోపణలు చేసింది. పారిశ్రామిక అవసరాల కోసం కేటాయించిన భూములను అక్రమంగా క్రమబద్ధీకరించుకుని వెంచర్లు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని కవిత ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే మాధవరం చేసిన భూ ఆక్రమణలపై విచారణ జరిపించాలంటూ కవిత డిమాండ్ చేశారు.అయితే ఎమ్మెల్యే మాధవరం మాత్రం కవిత భర్త అనిల్ ఆ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. ఐడీపీఎల్ భూముల వివాదంపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని మాధవరం కృష్ణారావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మాధవరం కృష్ణారావు శుక్రవారం లేఖలు పంపారు. కవిత, మాధవరంల పరస్పర ఆరోపణలతో ఐడీపీఎల్ భూములపై రాజకీయ రగడ కొనసాగుతున్న వేళ.. తెలంగాణ ప్రభుత్వం ఈ భూవివాదంపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కీలక నిర్ణయం తీసుకోవడం హాట్ టాపిక్ గా మారింది.

## వివాదస్పదమైన బీహార్ సీఎం నితీష్ కుమార్ చర్య




హైదరాబాద్ : బీహార్ సీఎం నితీష్ కుమార్ చర్యలు తరుచూ వివాదస్పదమవుతుండటం ఎన్డీఏకు తలనొప్పిగా మారింది. తాజాగా ఓ ముస్లిం మహిళ ముఖంపై నుంచి హిజాబ్ ను లాగడంపై దుమారం రేగుతుంది. ఆయుష్ వైద్యులకు నియామక పత్రాలు పంపిణీ చేస్తున్న క్రమంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ వేదిక పైన ఒక మహిళ ముసుగు(హిజాబ్ )ను లాగారు. వేదికపైనే ఉన్న ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి స్పందించి నితీష్ ను ఆపేందుకు ప్రయత్నించారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. ప్రతిపక్షాలు, మైనార్టీ సంఘాలు నితీష్ కుమార్ చర్యను తప్పుబడుతూ విమర్శలు సంధిస్తున్నాయి.ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో 74 ఏళ్ల సీఎం నితీష్ కుమార్ పదోసారి ఆ రాష్ట్ర సీఎంగా బాధ్యతలు చేపట్టారు. తాజాగా పాట్నాలో జరిగిన ఓ అధికారిక కార్యక్రమంలో నితీష్ కుమార్ ఒక మహిళా వైద్యురాలికి ఆయూష్ నియామక సర్టిఫికెట్ ఇస్తూ, ఆమె హిజాబ్‌ను తీయమని సైగ చేశారు. ఆమె స్పందించేలోపే నితీష్ కుమార్ స్వయంగా చేయి చాచి ఆమె ముఖం నుంచి హిజాబ్‌ను కిందకు లాగి తీసివేశారు. వేదికపై ఉన్న కొంతమంది నితీష్ చర్యతో విస్మయం వ్యక్తం చేస్తునే నవ్వుతూ కనిపించారు. నితీష్ చర్య రాజకీయంగా తీవ్ర దుమారం రేపుంది. నితీష్ మానసిక వైఖరి సరిగా లేదని..అతను వృద్ధాప్య సమస్యలతో తరుచూ మతి భ్రమణం చెందినట్లుగా వ్యవహరిస్తున్నాడని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.సీఎం నితీష్ కుమార్ చర్యను ప్రతిపక్ష ఆర్జేజీ, కాంగ్రెస్ లు తీవ్రంగా తప్పుబడుతూ విమర్శలు సంధిస్తున్నాయి. రాష్ట్రంలో అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి బహిరంగంగా ఇంత నీచమైన చర్యకు పాల్పడితే, రాష్ట్రంలో మహిళలకు ఎంత భద్రత ఉంటుంది?" అని ప్రశ్నిస్తూ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఆర్జేడీ ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ స్పందిస్తూ..ముస్లిం మహిళ ముసుగును (హిజాబ్) బలవంతంగా తొలగించడం అనేది ఆమె సాంస్కృతిక, మతపరమైన హక్కులను ఉల్లంఘించడమేనని మండిపడ్డారు. మహిళల పట్ల బీజేపీ-జేడీయూ కూటమి వైఖరికి ఈ చర్య నిదర్శనమని విమర్శించారు. నితీష్ చర్య ఓ వ్యక్తికి గల మత, సంస్కృతిపరమైన స్వేచ్ఛతో జీవించే హక్కును లాక్కోవడమేనని ఆరోపించారు. నితీశ్ కుమార్ మానసిక స్థితి బాగాలేదని అర్థమవుతుందని ఆరోపించింది.

## ఇమ్రాన్‌ను జైల్లో పెట్టి.. మునీర్‌కు సర్వాధికారాలా..




న్యూఢిల్లీ,ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి లో దాయాది పాకిస్థాన్ ను భారత్ మరోసారి ఎండగట్టింది. శాంతి గురించి బహిరంగంగా చర్చ సందర్భంగా జమ్ము కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన పాక్‌కు భారత్ గట్టిగా బదులిచ్చింది. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ను జైలుకి పంపి.. అతడికి విరోధి అయిన ఆసిమ్ మునీర్ కు సర్వాధికారాలు ఇచ్చిన ఘనత ఆ దేశానికే దక్కుతుందంటూ చురకలంటించింది.'లీడర్‌షిప్ ఫర్ పీస్' అనే అంశంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో బహిరంగ చర్చ జరిగింది. ఈ చర్చ సందర్భంగా పాక్ ప్రతినిధి ఆసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ మాట్లాడుతూ.. జమ్ము కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. అంతేకాదు సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ ఏకపక్షంగా నిలిపివేసిందంటూ ఆరోపణలు చేశారు. పాక్ వ్యాఖ్యలపై భారత్ ధీటుగా బదులిచ్చింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి హరీష్ పర్వతనేని మాట్లాడుతూ.. జమ్ముకశ్మీర్, లధఖ్‌లు భారత్‌లో అంతర్భాగమని, వాటిని విడదీయలేమని పునరుద్ఘాటించారు. భారత్‌కు, దేశంలోని ప్రజలకు హానికలిగించడంపైనే పాక్ దృష్టి ఉంటుందని విమర్శించారు.ఇక సింధు జలాల ఒప్పందాన్ని భారత్ ఎందుకు ముగించిందో కూడా ఈ సందర్భంగా హరీష్ పర్వతనేని వివరించారు. భారత్ 65 ఏళ్ల కిందట విశ్వాసం, సంకల్పం, స్నేహ స్ఫూర్తితో సింధూ జలాల ఒప్పందం కుదుర్చుకుందని గుర్తు చేశారు. ఈ ఆరున్నర దశాబ్దాలుగా భారత్‌పై పాక్ మూడు యుద్ధాలు, వేలాది ఉగ్రదాడులకు పాల్పడి ఒప్పందాన్ని ఉల్లంఘించిందని మండిపడ్డారు. గత నాలుగు దశాబ్దాల్లో పాక్ జరిపిన ఉగ్రదాడుల్లో పదివేల మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు.ఈ ఏడాది ఏప్రిల్‌లో జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని కూడా పర్వతనేని హరీష్ ప్రస్తావించారు. ఈ దాడిలో ఓ విదేశీయుడు సహా 26 మంది పౌరులు మరణించినట్లు గుర్తు చేశారు. అందుకే ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్రంగా ఉన్న పాకిస్థాన్.. ఉగ్రవాదానికి మద్దతును ముగించే వరకూ ఈ ఒప్పందాన్ని నిలుపుదల చేస్తామని ప్రకటించినట్లు వివరించారు. పాక్ ఉగ్రవాదం ఏ రూపంలో వచ్చిన భారత్ దాన్ని శక్తిమంతంగా ఎదుర్కొంటుందన్నారు.అంతటితో ఆగకుండా.. పాకిస్థాన్‌లోని ప్రజాస్వామ్యం, రాజకీయ పరిస్థితులను కూడా ఆయన ఎత్తిచూపారు. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను జైలుకు పంపి, అతనికి విరోధి అయిన ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ చేతుల్లో సర్వాధికారాలు పెట్టిందని విమర్శించారు. దీన్నిబట్టే ఆ దేశంలో ప్రజాస్వామ్యం ఎంత బలహీనంగా ఉందో, సైన్యం ఎలా రాజకీయ వ్యవస్థను నియంత్రిస్తుందో అర్థమవుతోందని వ్యాఖ్యానించారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా,రాహుల్ గాంధీలకు భారీ ఊరట



ఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు కీలక ఊరట లభించింది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన ఫిర్యాదు చట్టపరంగా నిలదొక్కుకోలేదని స్పష్టం చేస్తూ ఢిల్లీ కోర్టు దాన్ని కొట్టివేసింది.దీంతో ఈడీ దర్యాప్తు చట్టబద్ధతపై మరోసారి తీవ్ర ప్రశ్నలు తలెత్తాయి.కోర్టు పరిశీలనలో, ప్రాథమిక నేరానికి సంబంధించిన సరైన చట్టపరమైన ఆధారం లేకుండానే ఈడీ మనీ లాండరింగ్ కేసు నమోదు చేసిందన్న వాదనకు బలం చేకూరినట్టు న్యాయ వర్గాలు తెలిపాయి. కేవలం ప్రైవేట్ ఫిర్యాదుల ఆధారంగా ఈసీఐఆర్ నమోదు చేయడం చట్ట విరుద్ధమని కోర్టు అభిప్రాయపడినట్టు సమాచారం.

### కేసు నేపథ్యం

నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురించిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఆస్తుల వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో ఈ కేసు మొదలైంది. సుబ్రమణియన్ స్వామి దాఖలు చేసిన ప్రైవేట్ ఫిర్యాదు ఆధారంగా ఈడీ తొలుత దర్యాప్తు ప్రారంభించింది. అయితే, 2015-16లో ప్రైవేట్ ఫిర్యాదు ఆధారంగా మనీ లాండరింగ్ కేసు నమోదు చేయలేమంటూ ఈడీనే వెనక్కి తగ్గింది. తరువాత, 2019లో తన వైఖరిని మార్చుకున్న ఈడీ, పీఎంఎల్ఏ కింద మళ్లీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ క్రమంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు సుమన్ దూబే, సామ్ పిట్రోడా తదితరులపై ఆరోపణలు నమోదు చేసింది.ఎఫ్ఐఆర్ లేకుండా ఈడీ ఈసీఐఆర్ నమోదు చేయడం చట్ట విరుద్ధమని నిందితుల తరఫు న్యాయవాదులు వాదించారు. ఈడీ సొంతంగా జారీ చేసిన టెక్నికల్ సర్క్యులర్ నం.01/2015 ప్రకారం కూడా, ఈసీఐఆర్‌కు ముందు తప్పనిసరిగా ఎఫ్ఐఆర్ ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పీఎంఎల్ఏలో తరువాత చేసిన సవరణలను గతానికి వర్తింపజేయలేమని వాదించారు.ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, ఈడీ ఫిర్యాదును విచారణకు స్వీకరించలేమని తేల్చింది. ఈ తీర్పు రాజకీయంగా మాత్రమే కాకుండా, న్యాయపరంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. దర్యాప్తు సంస్థలు తమ అధికారాలను ఎలా వినియోగించాలి, ప్రైవేట్ ఫిర్యాదుల ఆధారంగా మనీ లాండరింగ్ కేసులు నమోదు చేయవచ్చా అన్న అంశాలపై ఈ తీర్పు స్పష్టతనిచ్చిందని నిపుణులు అంటున్నారు.కాంగ్రెస్ పార్టీ ఈ తీర్పును స్వాగతిస్తూ, 'ఇది రాజకీయ కక్షతో పెట్టిన కేసు' అని వ్యాఖ్యానించింది. మరోవైపు, ఈడీ తదుపరి న్యాయపరమైన మార్గాలను పరిశీలిస్తున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. నేషనల్ హెరాల్డ్ కేసు ఇకపై పైకోర్టుల్లో కొనసాగుతుందా, లేక ఇక్కడితో ముగుస్తుందా అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

## ముఖ్యమంత్రి కుర్చీనే టార్గెట్ చేసిన కవిత.. నెరవేరుతుందా?



హైదరాబాద్,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పెద్ద ప్రకటన చేశారు. బీఆర్ఎస్ ను షేక్ చేసే మాటలు మాట్లాడారు. అసలు ఎవ్వరూ చేయని ఆలోచనను ఆమె చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఏకంగా ముఖ్యమంత్రి పీఠాన్నే టార్గెట్ చేసిన కవిత నిర్ణయం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.ఇటీవల ఓ ప్రముఖ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కవిత తన రాజకీయ ఆశయాలు, భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టంగా మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం సమయంలో చాలామంది ఈ పార్టీ రాజకీయంగా నిలబడగలదా? ఎక్కువ కాలం కొనసాగుతుందా? అంటూ అనుమానాలు వ్యక్తం చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. అయితే ఆ అనుమానాలన్నింటినీ తలకిందులు చేస్తూ బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిందని, రాష్ట్రాన్ని సాధించి అధికారంలోకి వచ్చి పాలించిన చరిత్రను సృష్టించిందని కవిత తెలిపారు.ప్రజల మధ్య ఉండి వారి సమస్యల కోసం పోరాడినప్పుడే రాజకీయాల్లో ఎదుగుదల సాధ్యమవుతుందని కవిత అభిప్రాయపడ్డారు. ప్రజల నుంచి మద్దతు లభిస్తున్నప్పుడు నాయకత్వ బాధ్యతలను ఆశించడం సహజమని చెప్పారు. అటువంటి సందర్భంలో అత్యున్నత పదవిని ఆశించకపోవడం తప్పేనని స్పష్టం చేశారు. ప్రజా జీవితంలో ఉన్న ప్రతి ఒక్కరూ పెద్ద లక్ష్యాలు పెట్టుకోవాలని, అలా ఆలోచించడమే రాజకీయాల సారమని ఆమె పేర్కొన్నారు.ఇంటర్వ్యూలో కీలకంగా మహిళా నాయకత్వంపై మాట్లాడిన కవిత, తెలంగాణకు ఇప్పటివరకు ఒక్క మహిళా ముఖ్యమంత్రి కూడా లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో మొత్తం 27 మంది ముఖ్యమంత్రులు పనిచేసినా, ఒక్క మహిళకు కూడా ఆ అవకాశం రాకపోవడం దురదృష్టకరమని అన్నారు. మహిళలు ఎంతకాలం ఇంకా ఎదురుచూడాలని ప్రశ్నించారు. ఇప్పుడు అయినా తెలంగాణకు ఒక మహిళా సీఎం రావాల్సిన సమయం వచ్చిందని బలంగా వ్యాఖ్యానించారు.2029 ఎన్నికల్లో పోటీపై ప్రశ్నించగా అప్పటికి స్పష్టమైన రాజకీయ వ్యూహం లేదని మొదట కవిత తెలిపారు. ప్రస్తుతం ప్రజల మధ్యకు వెళ్లి, తమకు జరిగిన అవమానాలను పంచుకోవడం, ప్రజల సమస్యలను వినడం, వాటిని ప్రస్తావించడం పైనే దృష్టి పెట్టామని చెప్పారు. అయితే తర్వాత 'ఆస్క్ కవిత' కార్యక్రమంలో ఎక్స్ వేదికగా మాట్లాడిన ఆమె 2029 ఎన్నికల్లో పోటీ చేస్తానని స్పష్టంగా ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా చూస్తే, "నేనే తొలి తెలుగు మహిళా సీఎం అవుతాను" అన్న కవిత మాటలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. ఆచరణలో ఇది అంత ఈజీకాకున్నా అసాధ్యం ఏమీ కాదు. ఇప్పటికే షర్మిల ఓసారి ట్రైచేసి ఫెయిల్ అయిపోయారు. కవిత మాత్రం లాంగ్ టర్మ్ దీన్నీ ఆశయంగా పెట్టుకున్నారు. మహిళా నాయకత్వం, భవిష్యత్ రాజకీయ లక్ష్యాలపై ఆమె చేసిన వ్యాఖ్యలు రానున్న రోజుల్లో మరింత ప్రాధాన్యం సంతరించుకోనున్నా యి. తెలంగాణలో బలమైన బీఆర్ఎస్, కాంగ్రెస్,బీజేపీలను దాటి కవిత లక్ష్యం చేరుతుందా? లేదా? అన్నది వేచిచూడాలి.

### శంషాబాద్‌లో 13 విమానాలు రద్దు

శంషాబాద్ లోని అంతర్జాతీయ విమానాశ్రయం లో మొత్తం 13 విమానాలు రద్దయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీ లో వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్‌లైన్స్ అధికారులు వెల్లడించారు.రద్దయిన విమానాల్లో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సినవి ఏడు, ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాల్సినవి ఆరు ఉన్నాయి.

## బయటకు చెప్పిన వారు ఎవరో చెబితే చర్యలు తీసుకుంటాం



హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోడీ మీటింగ్ లో సోషల్ మీడియాలో యాక్టివిటీ పెంచాలని సూచించారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సమావేశం విషయాలు బయటకు చెప్పొద్దని ప్రధాని స్వయంగా చెప్పారని అన్నారు. నరేంద్ర మోడీతో టిబిజెపి ఎంపిల సమావేశంపై వచ్చిన లీకులపై కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ. ప్రధాని చెప్పినా.. మీటింగ్ లో విషయాలను బయటకు చెప్పారని, బయటకు చెప్పిన వారు ఎవరో చెబితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లోపల జరిగింది ఒకటి, బయట ప్రచారం చేసింది మరొకటి అని.. తెలియజేశారు.తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయాలని మోడీ కోరారని అన్నారు. దక్షిణ భారత్ నుంచి ఇప్పటి వరకు ఇద్దరు ఉపరాష్ట్రపతులు అయ్యారని, బిజెపిలో కార్యకర్త స్థాయి నుంచి అధ్యక్షుడి స్థాయి వరకు వెళ్లే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఓట్ చోరీ ర్యాలీలో మోడీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను కిషన్ రెడ్డి ఖండించారు. రాహుల్ గాంధీ అనైతికంగా మాట్లాడుతున్నారని, ఏ విషయాలు మాట్లాడాలో అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ ఉండటం దురదృష్టకరమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## సంపాదకీయం

**బుధవారం 17-12-2025**

# రూపాయి క్షీణత ఎంతదాకా?

డాలర్‌తో రూపాయి మారకం విలువ మునుపెన్నడూ లేనంతగా 90 రూపాయలకు పడిపోయింది. దీనివల్ల దేశార్థికంపై ప్రతికూల ప్రభావం ప్రసరిస్తుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదెంతవరకూ నిజం? రూపాయిని మనమెలా బలోపేతం చేసుకోగలం?భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 3.30 రూపా యలు. 1991లో ఆర్థిక సంస్కరణలు వచ్చిన తరవాత రూపాయి తన విలువను వేగంగా కోల్పోయింది. నిరుడు 83 రూపాయల దగ్గర కొనసాగిన రూపాయి విలువ- ఇప్పుడు 90రూపాయలకు పడిపోవడం ఆర్థికవేత్తలను విస్మయ పరుస్తోంది. సర్కారీ వర్గాలు మాత్రం ఆందోళనేమీ అక్కర్లేదని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. డాలర్ బలపడటంవల్లే రూపాయి మారకపు విలువ తగ్గిందిగానీ, రూపాయి బలహీనపడలేదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు.

ఒత్తిడి ఎందుకు పెరుగుతోంది?

ఆసియాలోని మిగతా దేశాలతో పోలిస్తే మన రూపాయే ఎక్కువగా ప్రభావితమవుతుంటుంది. ఇందుకు ప్రధాన కారణం- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న వాణిజ్య నిర్ణయాలూ, ప్రతీకార సుంకాలే. మరోవైపు డాలర్ బలోపేతానికి అమెరికా ఫెడరల్ రిజర్వ్ కూడా కొన్ని చర్యలు తీసుకుంటోంది. న్యూదిల్లీ-వాషింగ్టన్ వాణిజ్య చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడటం, భారతీయ ఎగుమతులపై అగ్రరాజ్యం 50శాతం సుంకాలు విధించడం... విదేశీ మదుపరులు 17బిలియన్ డాలర్ల దాకా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం, డాలర్ కొనుగోలుకు మదుపరులు ఎగబడటం వంటి వరుస పరిణామాలతో డాలర్‌కు డిమాండ్ పెరిగింది. దాంతో రూపాయి మారకం విలువ పడిపోయింది. ఇప్పుడు రూపాయి క్షీణించడం గురించి భిన్న వాదనలు, రాజకీయ విమర్శలెన్నో వినిపిస్తున్నాయి. వాటిని పక్కనపెడితే, రూపాయి విలువ పతనం ఇప్పటికిప్పుడు ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రతికూల ప్రభావమేదీ చూపకపోవచ్చు. కానీ, దీనివల్ల దీర్ఘకాలంలో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయన్న సూచనలైతే కనిపిస్తున్నాయి. ఎగుమతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వమే స్వచ్ఛందంగా రూపాయి విలువను తగ్గిస్తే(డీవాల్యుయేషన్) కొన్ని రంగాల్లో అనుకూల ఫలితాలు వస్తాయి. 1966లో ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికీ, 1991లో విదేశీ మారకద్రవ్య నిల్వల లోటును అధిగమించడానికీ ఇలాగే చేశారు. ఇప్పుడు మార్కెట్ శక్తుల ప్రభావం వల్ల రూపాయి విలువ పతనమవుతోంది కాబట్టి-ప్రతికూల ఫలితాలే ఎక్కువగా రావచ్చు. జేపీ మోర్గాన్ ఇండియా చీఫ్ సాజిత్ చినోయ్ చెబుతున్నట్లు- ప్రపంచవ్యాప్తంగా భారతీయ వస్తువులు చౌకగా మారడానికీ, దిగుమతులు భారంగా మారి దేశీయ తయారీదారులకు తోడ్పడటానికీ, ఉద్యోగాల సృష్టికీ, చైనా వస్తువులకు అడ్డుకట్ట వేయడానికీ రూపాయి విలువ తగ్గడం కొంతవరకు ఉపయోగపడుతుంది. కానీ, ఇదంతా పరిమితంగానే ఉంటుంది. ఆర్థిక పరిభాషలో చెప్పాలంటే- రూపాయి విలువ తగ్గినప్పుడు ధరలు పెరుగుతాయి. అంటే, ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. దానివల్ల ప్రజల కొనుగోలుశక్తి, వస్తువులకు డిమాండ్ తగ్గిపోతుంది. పెట్టుబడులూ ఉద్యోగావకాశాలూ తగ్గిపోతాయి.అయితే, ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ శ్లాబులు తగ్గించడం, ఆర్‌బీఐ ద్రవ్యవిధానం పరిస్థితిని కొంతవరకు సరిదిద్దగలుగుతాయి. సహజంగా రూపాయి విలువ క్షీణత ఎగుమతులను ప్రోత్సహించి, దిగుమతులను నిరుత్సాహపరుస్తుంది. దీనివల్ల విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో అనుకూలత ఏర్పడుతుంది. కానీ, ట్రంప్ సుంకాల పెంపు వల్ల రూపాయి విలువ తగ్గినా, ఎగుమతుల రంగంలో రావాల్సిన అనుకూలత రాకుండా పోయే ప్రమాదముంది. ఇండియా 85శాతానికి పైగా చమురు, 60శాతం వంట నూనెలతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు, ఎరువులు, రసాయనాలు, యంత్రాలు వంటి వాటిని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. ఇప్పుడు రూపాయి విలువ క్షీణించడం వల్ల వీటి ధరలు పెరగవచ్చు. ద్రవ్యోల్బణం తరహా పరిస్థితులు రవాణా వ్యవస్థపైనా, తద్వారా దేశార్థికంపైనా ప్రతికూల ప్రభావం చూపవచ్చు.

మన కరెన్సీ బలపడే మార్గమేంటి?

రూపాయి విలువ పతనాన్ని అడ్డుకోవడానికి రిజర్వ్‌బ్యాంకు చేపట్టే వడ్డీ రేట్ల పెంపు, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ వంటి చర్యలు తాత్కాలిక ఉపశమనం కలిగిస్తాయి. అయితే, విదేశీ మదుపరుల్లో విశ్వాసం కలిగించడం, దిగుమతులను తగ్గించుకోవడం, దేశీయ ఉత్పత్తులకు గిరాకీ పెంచడం, రష్యా సహా ఇతర భాగస్వామ్య దేశాలతో సొంత కరెన్సీలో వ్యాపారం చేయడం, పోర్ట్‌ఫోలియో పెట్టుబడులను ఆకర్షించడం వంటివి ఎంతైనా అవసరం. విదేశీ మారకద్రవ్య నిల్వలనూ...పొదుపు- మదుపు- వినియోగాన్ని పెంచడం ద్వారా దేశార్థికాన్నీ, రూపాయినీ బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారించాలి. భవిష్యత్తులో భారత్ గణనీయమైన వృద్ధిరేటును సాధించి, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా- రూపాయి విలువను మార్కెట్ శక్తులే నిర్ణయిస్తాయని గుర్తుంచుకోవాలి!

# తిరుమలలో పటిష్టంగా వైకుంఠద్వార దర్శనాలు



తిరుమల తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వైకుంఠ ద్వార దర్శనాలకు విస్తృత ఏర్పాట్లు చేశామని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు ఉంటాయని చెప్పారు. తిరుమలలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి మూడు రోజులకు ఎలక్ట్రానిక్ లక్కీడిప్ ద్వారా టోకెన్లు కేటాయించాం. మిగతా ఏడు రోజులు సామాన్య భక్తులకు టోకెన్లు లేకపోయినా సర్వదర్శనం ద్వారా వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టిసారించాం అని తెలిపారు. భక్తుల రద్దీ ఉన్న ప్రదేశాల్లో ఏర్పాట్లు, సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. దాత మంతెన రామలింగరాజు సహకారంతో పీఏసీలను అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతాం అన్నారు. ఇటీవల రూ. 9కోట్లు విరాళంగా ఆయన అందించారు. ఆలయ ధ్వజస్తంభాల కోసం 100 ఎకరాల్లో స్వయంగా దివ్య వృక్షాలను పెంచాలని భావిస్తోంది. పలమనేరులో తితిదే గోశాల ఆవరణ వృక్షాల పెంపుదలకు అనువైన స్థలంగా గుర్తించాం. మంగళవారం తితిదే పాలకమండలి సమావేశం జరుగుతుంది. 50 అజెండా అంశాలపై చర్చిస్తాం. దివ్య వృక్షాల ప్రాజెక్టుపై పాలక మండలి సమావేశంలో చర్చించి నిర్ణయం ప్రకటిస్తాం అని బీఆర్ నాయుడు తెలిపారు.ఇదిలావుంటే బోర్డు సభ్యులు శాంతారాం, నరేష్ కుమార్‌లతో కలిసి తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-2 ను పరిశీలించారు. ఈ సందర్భంగా లాకర్ల జారీ కేంద్రం, కళ్యాణకట్ట, అన్నప్రసాద విభాగాలను పరిశీలించి భక్తులతో మాట్లాడారు. గత వైకుంఠ ఏకాదశి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. అందుబాటులో ఉన్న సౌకర్యాలపై భక్తులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని, అయితే సాధారణ భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈఈ వేణుగోపాల్, డిప్యూటీ ఈవో (రిసెప్షన్) భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి కోసం 'అఖండ' తాండవం

హైదరాబాద్,నిరంతరం ప్రజల మధ్య ఉండి వారి కష్టసుఖాలు తెలుసుకొని తమ శక్తి మేరకు వారి అవసరాలు తీర్చి, ప్రజాదరణ పొంది అధికారంలోకి రావాలని రాజకీయ పార్టీలు అహర్నిశలు పాటుపడుతూ ఉండేవి ఒకప్పుడు. ఇప్పుడు రోజులు మారాయి. రాజకీయ పార్టీల పనితీరులో కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. ఒకప్పుడు 'నువ్వు ప్రజల్లో ఉండడం లేదట' అని కార్యకర్తలని, కిందిస్థాయి నాయకులను నిలదీసేవారు పెద్ద నాయకులు. ఇప్పుడు 'నువ్వు సోషల్ మీడియాలో చురుగ్గా లేవట' అని కోప్పడే స్థితి వచ్చింది. నిజమే, టెక్నాలజీ ఇంత అభివృద్ధి సాధించినప్పుడు నాయకులు నేరుగా వెళ్లి ప్రజలను కలవాల్సిన అవసరం ఏమిటి? సోషల్ మీడియా ద్వారా తాము చెప్పదలచుకున్నది చెప్పొచ్చు, ప్రజల నుంచి తెలుసుకోవాల్సిన విషయాలు తెలుసుకోవచ్చు అని రాజకీయ పార్టీల అగ్రనాయకులు అనుకుంటున్నారు. దీనికి తాజా ఉదాహరణ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా తన పార్టీకి చెందిన తెలంగాణ ఎంపీలతో అన్నమాటలు. 'మీరు సోషల్ మీడియాలో చురుకుగా ఉండటం లేదు, మీకంటే అసదుద్దీన్ ఒవైసి చాలా మేలు. సమర్థవంతంగా తన సోషల్ మీడియా నడుపుతున్నాడు' అని వ్యాఖ్యానించారట ప్రధానమంత్రి. సోషల్ మీడియాలో వెనకబడితే ప్రజల మెప్పు పొందటంలో కూడా వెనుకబడిపోతారన్నమాట. ఇదీ ప్రస్తుత రాజకీయాల పరిస్థితి.తెలంగాణలో బిజెపి పరిస్థితి మీద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర అసంతృప్తితో ఉన్నారట. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా గత గురువారం ఉదయం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన పార్టీ పార్లమెంట్ సభ్యులతో మోడీ బ్రేక్ ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన తెలంగాణ ఎంపీలకు తలంటినట్టు సమాచారం. ప్రధానమంత్రికి- పార్లమెంట్ సభ్యులకు మధ్య ఆ బ్రేక్ ఫాస్ట్ సమావేశంలో జరిగింది ఏమిటి అన్న విషయం అధికారికంగా ఎవరికి తెలియకపోయినా రెండు రాష్ట్రాల ప్రాంతీయ మీడియా అంతటా దాదాపుగా ఒకే రకమైన సమాచారం వార్తగా వచ్చింది. ఇందులో కొత్తగాని, వింతగానీ ఏమీ లేదు. ఆ సమావేశంలో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులు లేదా ప్రధానమంత్రి కార్యాలయ వర్గాలు మీడియాకి సమాచారాన్ని అందించి ఉండవచ్చు. అయితే మీడియాకు ఈ సమాచారం ఎవరు అందించి ఉంటే వారు తమకు అనుకూలంగా ఉండే సమాచారాన్ని మాత్రమే బయటపెడతారు సహజంగా. సరిగా పని చెయ్యడం లేదు, ముఠాలు కడుతున్నారు అని తమను ప్రధాని తిట్టినట్టు తెలంగాణ ఎంపీలు, కేంద్ర మంత్రులు చెప్పుకోరు కాబట్టి ఇది పొరుగు రాష్ట్ర ఎంపీలో, ప్రధాన మంత్రి కార్యాలయంలో లీక్ చేసినదయి ఉండొచ్చు.ఇక ఆ భేటీలో ప్రధానమంత్రి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బిజెపి పరిస్థితి మీద వెలిబుచ్చిన అభిప్రాయాన్ని గురించి మాట్లాడుకోవాలి. పార్టీ నేతలు సరిగ్గా పనిచేయడం లేదని, ముఠా తగాదాలు పెరిగిపోయాయని ప్రధానమంత్రి తెలంగాణ ఎంపీల మీద ఆగ్రహం ప్రదర్శించారు. వేర్వేరు రాజకీయాలనుండి వచ్చిన వాళ్లంతా ఒక దగ్గర చేరినప్పుడు ముఠాలు ఏర్పడకుండా ఎలా ఉంటాయి? ఆ ముఠాల మధ్య తగాదా లేకుండా ఎలా ఉంటుంది? ఆ విషయం ప్రధానమంత్రికి బాగా తెలుసు. ఇవాళ తెలంగాణలో భారతీయ జనతా పార్టీ కొన్ని పార్టీల కదంబం. భారత రాష్ట్ర సమితి నుంచి, కాంగ్రెస్ పార్టీ నుంచి భారతీయ జనతా పార్టీలో చేరిన నాయకులు కూడా ఉన్నారు. వారిలో ప్రజాదరణ కలిగిన వాళ్లు కూడా ఉన్నారు. అటువంటప్పుడు సహజంగానే అంతర్గత కలహాలు ఏ రాజకీయ పార్టీకైనా తప్పని బెడదే. తెలంగాణ బిజెపిలో కూడా అదే జరుగుతున్నది. అక్కడ బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లో ప్రధానమంత్రి తెలంగాణ ఎంపీలకు క్లాస్ తీసుకుంటున్న సమయంలోనే ఇక్కడ తెలంగాణలో ఇద్దరు ఎంపీలకు సంబంధించిన అంతఃకలహం సోషల్ మీడియాలో జోరు అందుకున్నది. సోషల్ మీడియాలో మీరు వెనుకబడి ఉన్నారు, మీకంటే ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ చాలా నయం, చాలా సమర్థంగా ఆయన సోషల్ మీడియా నిర్వహిస్తున్నారని ప్రధానమంత్రి ఈ బ్రేక్ ఫాస్ట్ సమావేశంలో అన్నట్టు వార్తలు వచ్చాయి. ఒకరి మీద ఒకరు విమర్శలు గుప్పించుకోవడంలో, అంతఃకలహాల్ని బహిరంగం చేసుకోవడంలో తెలంగాణ బిజెపి నాయకులు సోషల్ మీడియాలో వెనుకబడి లేరు. 'నాకు అన్నీ తెలుసు' అని ఒక ఎంపీ నోరు మూయించిన ప్రధానమంత్రికి ఈ విషయం తెలిసినట్టు లేదు. మొన్న ముగిసిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఒక ఎంపీ పార్టీ వారిని కాదని తన అనుయాయులను నిలబెట్టి ఓటమి పాలు చేసుకున్నారని బిజెపికి చెందిన కేంద్ర మంత్రి సహాయకుడు ఒకరు సోషల్ మీడియాలో పెట్టిన విషయం ప్రస్తుతం ప్రచారంలో ఉన్నది.తెలంగాణలో బిజెపి నాయకులు కనీసం ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదన్నది ప్రధానమంత్రి ఆవేదన. తెలంగాణలో రెండు ప్రధాన ప్రతిపక్ష పార్టీల పరిస్థితి అదే విధంగా తయారవుతున్నది. భారతీయ జనతా పార్టీ, భారత రాష్ట్ర సమితి రెండిటి ప్రస్తుత పరిస్థితి చూస్తే కాంగ్రెస్ నెత్తిన పాలు పోసినట్టే కనిపిస్తున్నది. భారతీయ జనతా పార్టీలో నెలకొన్న అంతఃకలహాలు, భారత రాష్ట్ర సమితిలో రోజురోజుకీ బయట పడుతున్న కుటుంబ తగాదాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదే పదే చెబుతున్నట్టుగా కాంగ్రెస్ పార్టీకి రెండవ టర్మ్ ఖాయం చేసినట్టే కనిపిస్తున్నది. 'మోడీజీ తెలంగాణ మే ఆప్కా కిచిడి పక్ రా నహీ షాయద్'.ఇక తెలంగాణతోపాటు ప్రధానమంత్రి బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లో పాల్గొన్న మిగతా రెండు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, అండమాన్ నికోబార్ ఐలాండ్స్ విషయానికొస్తే అండమాన్ గురించి చెప్పుకోవాల్సిందేమీ లేదు పెద్దగా. కేంద్రపాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ ఐలాండ్ లో ఒకే ఒక్క లోక్‌సభ స్థానం ఉంది. ఆ ఒక్క స్థానం నుండి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి గెలిచారు. శాసనసభ లేదు



కాబట్టి రాజ్యసభ సభ్యులు ఉండే అవకాశం లేదు. ఇక తెలంగాణతో పోలిస్తే సంఖ్యాపరంగా ఆంధ్రప్రదేశ్‌ను పెద్ద రాష్ట్రంగా భావించాలి. 25మంది లోకసభ సభ్యులు, 11మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. అయితే కూటమిలో భాగంగా ఉన్నది కాబట్టి భారతీయ జనతా పార్టీకి ఆ రాష్ట్రంలో ముగ్గురు లోకసభ సభ్యులు, నలుగురు రాజ్యసభ సభ్యులు ఉన్నారు. అలా చూసినట్లయితే ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ తెలంగాణలోనే బిజెపికి బలం ఎక్కువ పార్లమెంట్లో. సరే తను భాగస్వామిగా ఉన్న కూటమి అధికారంలో ఉన్న రాష్ట్రం కాబట్టి ప్రధానమంత్రి ఆ రాష్ట్రం గురించి నాలుగు మంచి మాటలు చెప్పినట్టు ఉన్నారు. అందులో ఏపీలో చంద్రబాబు నాయుడుతో కలిసి పనిచేయడం మంచి పరిణామం అని ఆయన పేర్కొన్నట్టు, రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి మీద కూడా తనకు మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చిందని, పెట్టుబడులు కూడా భారీగా వస్తున్నాయని అన్నట్టు మీడియా ప్రచురించింది. ముందే చెప్పుకున్నట్టు అధికారంలో ఉన్న కూటమిలో భాగస్వామి పార్టీ కాబట్టి ఆ మాత్రం శభాష్ అని వెన్ను చరుచుకోవడంలో తప్పులేదు. అయితే 'మేరెకో సబ్ కుఛ్ మాలూమ్' (నాకంతా తెలుసు) అని తెలంగాణ ఎంపీలను గదమాయించిన ప్రధానమంత్రి మోడీ ఆంధ్రప్రదేశ్ లో సబ్ కుఛ్ మాలూమ్ కరేతో (అంతా తెలుసుకుంటే) బాగుండేది. ఆంధ్రప్రదేశ్ లో గతంలో కంటే బిజెపి బలపడుతుందని, ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని కేంద్రమంత్రి భూపతిరాజు చెప్పిన మాటలు విని శభాష్ అనకుండా అక్కడి వాస్తవ పరిస్థితిని కూడా ప్రధానమంత్రి తెలుసుకుంటే బాగుండేది.ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి బలపడుతున్న మాట ఎలా ఉన్నా, బిజెపి అగ్రనాయకత్వాన్ని సంతుష్టులను చేసుకోవడానికి, అమితానందపరచడానికి కూటమిలోని రెండు మిగతా పక్షాలు పడరాని పాట్లు పడుతున్న మాట మాత్రం వాస్తవం. కూటమి ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు నారా లోకేష్, కూటమిలోని మరో భాగస్వామ్య పార్టీ జనసేనకు చెందిన డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వ అధినేత నరేంద్ర మోడీని ఆకాశానికి ఎత్తడానికి దొరికిన ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. వేషధారణ కూడా కాషాయానికి మార్చేసి కొద్ది రోజులు 'ఐయామ్ ఏ అన్ అపొలజిటికల్ సనాతన హిందూ' అని బహిరంగ ప్రదర్శనలు చేసిన పవన్ కళ్యాణ్ ఈ మధ్య జోరు తగ్గిస్తే ఆ స్థానాన్ని ఆక్రమించుకోవడానికి తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుడు, నటుడు, ముఖ్యమంత్రి బావమరిది అయినా నందమూరి బాలకృష్ణ బయలుదేరాడు. మూడు రోజుల క్రితం ఆయన నటించిన ఒక సీక్వెల్ 'అఖండ 2' విడుదలైంది. అందులో ఆయన చేసిన తాండవం చూస్తే బిజెపిని, ఆ పార్టీకి మార్గనిర్దేశం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌ను సంతుష్టిపరచడానికి ఎంత శ్రమ పడ్డాడో అర్థం అవుతుంది. అన్నట్టు ఈ సినిమా విడుదలకు ముందే ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మహేష్ భగవత్ ఢిల్లీలోనే ఒక ప్రత్యేక ప్రదర్శన వేయించుకొని చూసి గొప్పగా ఉందని మెచ్చుకున్నారట. ఈ సినిమాలో మిగతా అసహజ విన్యాసాలనట్లా వదిలేస్తే సర్వమతాలకు నిలయమైన భారతదేశాన్ని కాషాయం కట్టుకున్న దేశం చేసేసాడు. ఒంటిచేత్తో సనాతన హిందూధర్మాన్ని మూడు గంటల్లో కాపాడేసాడు. ఇది కేవలం కేంద్రంలో అధికారంలో ఉన్న కూటమికి నాయకత్వం వహిస్తున్న బిజెపి పెద్దలను మరింత మచ్చిక చేసుకోడానికే అని సినిమా చూసిన వాళ్లందరికీ అర్థం అవుతుంది. ఇది కేవలం రచయిత, దర్శకుడూ అయిన బోయపాటి బుర్రలో పుట్టిందా అన్నది అనుమానమే. సినిమాలో ఇంత అసహజత్వాన్ని చూసి పెద్దాయన మహేష్ భగవత్ కూడా మొహం పక్కకు తిప్పుకుని నవ్వేసి ఉంటారు. కూటమిలోని బిజెపియేతర పక్షాలు రెండూ పోటీపడి ఇలా హిందుత్వ ప్రచారానికి దిగితే ఆంధ్రప్రదేశ్ లో అసలు బిజెపి ఎదుగుదలకే ఎసరు అవుతుందేమో.కొసమెరుపు కూడా ఉండాలి కదా. రేపోమాపో ఆంధ్రప్రదేశ్ లో యువరాజుకు పట్టాభిషేకం తప్పదంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను ఢిల్లీ పర్యటనలను తగ్గించుకొని ఎక్కువ కొడుకు లోకేష్‌నే పంపిస్తున్నారని చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. 15 ఏళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలో ఉంటుందని, ఆ కూటమికి చంద్రబాబునాయుడే ముఖ్యమంత్రి అని పదేపదే ప్రకటిస్తూ వచ్చిన పవన్ కళ్యాణ్ ఈ పరిణామాన్ని ఎలా తీసుకుంటాడో కానీ తెలుగుదేశం పార్టీని, ముఖ్యంగా లోకేష్ ను బలంగా సమర్థిస్తున్న ఒక వర్గం మీడియా ఉబ్బితబ్బిబ్బై పోతున్నది. అందులో భాగంగానే ఆ మీడియాకి లోకేశ్ ను పల్లెత్తు మాట ఎవరు అన్నా భోజనం సహించడం లేదు.ఇటీవల భారత విమానయానంలో ఒక అవాంతరం ఏర్పడింది. దానిమీద బాధ్యులు ఎవరనే చర్చ జాతీయ మీడియాలో జరుగుతున్నప్పుడు తెలుగుదేశం పార్టీలోని లోకేశ్ భక్తుడు ఒకాయన ఈ సంక్షోభం మీద వార్‌రూమ్ ఏర్పాటు చేసి తమ నాయకుడు పర్యవేక్షిస్తున్నాడని చెప్పడంతో రిపబ్లిక్ టివి ముఖ్య సంపాదకుడు అర్నాబ్ గోస్వామి 'కేంద్ర విమానయాన

# తిరుమలలో చైర్మన్ ఆకస్మిక తనిఖీలు

తిరుమల,తిరుమలలో టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు ఆకస్మిక తనిఖీలు చేశారు. సామాన్యభక్తులు ఉచిత వసతి పొందే పీఏసిలలో చైర్మన్ తనిఖీలు చేశారు. లాకర్లు, కళ్యాణకట్ట, భోజనశాలలో క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. సౌకర్యాలపై భక్తుల అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దాత మంతెన రామలింగరాజు సహకారంతో త్వరలో మరింత అత్యాధునిక సౌకర్యాలతో టీటీడీ పీఏసిలను తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వైకుంఠద్వార దర్శనాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. డిసెంబర్ 30వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు జరగనున్నాయని తెలిపారు. మొదటి మూడురోజులకు ఎలక్ట్రానిక్ లక్కీడిప్ ద్వారా టోకన్లు కేటాయించామని పేర్కొన్నారు. మిగతా 7 రోజులు సామాన్యభక్తులు ఎలాంటి టోకన్లు లేకపోయినా సర్వదర్శనం ద్వారా వైకుంఠద్వార దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాల పై ప్రత్యేక దృష్టి పెట్టమని తెలిపారు. రేపు 50 అజెండా అంశాలపై పాలకమండలి సమావేశం జరగనుందని తెలిపారు. భక్తుల రద్దీ ఉన్న ప్రదేశాలలో ఏర్పాట్లు, సదుపాయాలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తానని అన్నారు. ఇటీవల 9 కోట్ల రూపాయలు దాత విరాళంగా అందజేశారని తెలిపారు. ఆలయ ధ్వజస్తంభాల కోసం 100 ఎకరాల్లో టీటీడీ స్వయంగా దివ్యవృక్షాల పెంచాలను భావిస్తుందని, పలమనేరులోని టీటీడీ గోశాల ఆవరణ వృక్షాల పెంపుదలకు అనువైన స్థలంగా గుర్తించామని తెలిపారు. దివ్యవృక్షాల ప్రాజెక్టు పై రేపు జరగబోయే పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు. ఏడు నెలలకు అవసరాలకు సరిపడా బ్లేడులను ప్రముఖ బ్లేడు తయారీ సంస్థ 17వ తేదీ విరాళంగా అందజేయనున్నారని తెలిపారు.

# కౌలు రైతులకు ఏపి ప్రభుత్వం శుభవార్త

అమరావతి, ఆంధప్రదేశ్ ప్రభుత్వం కౌలు రైతులకుశుభవార్త చెప్పింది. సాగు పెట్టుబడి కోసం రూ. లక్ష వరకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. పీఏసీఎస్‌ల ద్వారా ఈ రుణాలు మంజూరు చేయనున్నారు. కౌలు రైతులను మరింత ప్రోత్సహించే ప్రణాళికలో భాగంగా అర్హులైన కౌలు రైతులకు రూ.లక్ష వరకు రుణాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. వ్యవసాయ సహకార పరపతి సంఘాల నుంచి రుణాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే ప్రస్తుతం అధికారులు రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతుల వివరాలు సేకరించే పక్రియను వేగవంతం చేశారు. ఈ వివరాల సేకరణ పూర్తయిన వెంటనే అర్హులైన లబ్దిదారులకు రుణాలు మంజూరు చేసే అవకాశం ఉంది. రుణాలు విత్తనాలు, ఎరువులు, కూలీ ఖర్చుల వంటి ముఖ్యమైన వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.ఈ రుణ ప్రయోజనం పొందేందుకు లబ్దిదారులు సంబంధిత అధికారుల నుంచి జారీ చేయబడిన కౌలు పత్రాలు కలిగి ఉండాలి. కొందరు కౌలు రైతులు సహకార సంఘం పరిధిలో నివాసం ఉంటూ ఆ సంఘంలో సభ్యత్వం కలిగి ఉండాలి. ఈ రుణానికి దరఖాస్తు చేసే రైతు కౌలు పత్రంలో చూపించిన సాగు భూమి ఎకరాకు తగ్గకుండా ఉండాలి. అసైన్డ్ భూములు సాగు చేస్తున్న కౌలు పత్రాలు ఉన్నవారు మాత్రం ఈ రుణాలకు అర్హులు కాదు. సొంత ఇల్లు ఉన్నవారికి లోన్ మంజూరు చేయడంలో అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఏరోజైతే లోన్ తీసుకుంటున్నారో అప్పటి నుంచి ఏడాదిలోపు అసలుతోపాటు వడ్డీని తిరిగి చెల్లించాల్సి

# ఇంద్రకీలాద్రిపై ముగిసిన భవానీ దీక్షల విరమణ

విజయవాడ, విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి భవానీలుపోటెత్తారు. దీక్ష విరమణకు చివరి రోజు కావడంతో భారీగా తరలి వచ్చారు. ఇంద్రకీలాద్రిపై పూర్ణాహుతితో భవానీ దీక్షా విరమణలు సోమవారం ముగిశాయి. ఐదు రోజుల పాటు దుర్గమ్మను ఐదులక్షల మందికి పైగా భవానీలు దర్శించుకున్నారు. శని, ఆదివారాలు వారాంతం కావడంతో పెద్ద సంఖ్యలో దుర్గమ్మ సన్నిధికి భవానీలు, సామాన్య భక్తులు తరలివచ్చారు. జై దుర్గా జై జై దుర్గా నామస్మరణతో ఇంద్రకీలాద్రి మార్మోగుతోంది.తెల్లవారుజాము నుంచే భవానీలు విజయవాడకు తరలివచ్చి అమ్మను దర్శించుకుని దీక్షను విరమిస్తున్నారు. ముందుగా గిరి ప్రదక్షిణ చేసుకుని ఆపై కనక దుర్గమ్మ దర్శనం కోసం క్యూలైన్లలో భవానీలు వేచి ఉన్నారు. అయితే, మరో రెండు రోజుల పాటు భవానీలు వచ్చే అవకాశం ఉంది. భవానీల రద్దీ దృష్ట్యా రెండ్రోజులు పాటు దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భవానీలు భారీగా తరలి వస్తారని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో అన్ని ఆర్జిత సేవలతో పాటు వీఐపీ ప్రోటోకాల్ సేవలు రద్దు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శీనానాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మీడియాతో మాట్లాడారు. భవానీలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఐదురోజుల పాటు అమ్మవారిని ఐదు లక్షల మందికి పైగా దర్శించుకున్నారని వివరించారు. ఇవాళ, రేపు భవానీల రద్దీ ఉంటుందని వెల్లడించారు. గురు భవానీల సమక్షంలో మాల విరమణకు ఏర్పాట్లు చేశామని చెప్పుకొచ్చారు. వీఐపీలు ఎవరు వచ్చినా ఈ రెండు రోజుల పాటు దర్శనాలు కల్పించలేమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వీఐపీ భక్తులు గమనించాలని సూచించారు.

## సర్పంచ్‌గా 140 ఓట్లతో గెలుపు..వార్డు మెంబర్‌గా ఏకగ్రీవం

జగిత్యాల,రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్‌గా, వార్డు మెంబర్‌గా ఓ మహిళ విజయం సాధించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఉప్పుమడుగు సర్పంచ్‌గా, ఆరో వార్డు సభ్యురాలిగా కొత్తకొండ రోజా నవీన్ పోటీచేశారు. ఆరో వార్డుకు నామినేషన్లు రాకపోవడంతో రోజా ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆమె ఏకగ్రీవమయ్యారు. మరోవైపు ఆదివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో రోజా సర్పంచ్‌గానూ గెలుపొందారు. తన సమీప అభ్యర్థిపై 140 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. దీంతో అటు వార్డు మెంబర్‌గా, ఇటు సర్పంచిగా ఎన్నికై డబుల్ విక్టరీ సొంతం చేసుకున్నారు. అయితే ఆమె వార్డు మెంబర్ పదవికి రాజీనామా చేయనున్నారు. మరోవైపు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్తా, మామలతో కోడళ్లు సవాల్ విసిరి విజయం సాధించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం శ్రీరామ్‌నగర్ సర్పంచ్ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వు అయింది. సర్పంచ్ స్థానానికి ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకు, కోడలు నామినేషన్ వేయగా, కొడుకు తాళ్లపెల్లి శ్రీరామ్‌గౌడ్ విత్‌డ్రా చేసుకున్నారు. కోడలు తాళ్లపెల్లి రాధిక మాత్రం ఉపసంహరించుకోలేదు. బరిలో మామ తాళ్లపల్లి సత్యనారాయణగౌడ్, కోడలు రాధిక నిలిచారు. ఆదివారం ఎన్నికల్లో మామపై రాధిక 14 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం గన్‌శ్యాందాస్‌నగర్ గ్రామ సర్పంచ్ స్థానానికి అత్తాకోడళ్లు పోటీపడ్డారు. అత్త సూర నర్సమ్మపై కోడలు సూర రమ 18 ఓట్ల మెజార్టీతో విజయం

## ఉత్తరాదిలో పెరిగిన చలి

న్యూఢిల్లీ,ఉత్తర భారతదేశాన్ని చలి గడ గడలాడిస్తుంది. రాజధాని ఢిల్లీని పొగమంచు కప్పేసింది. దీంతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఢిల్లీ సహా పంజాబ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పడిపోవడంతో విపరీతమైన పొంగ మంచు కమ్ముకోవడంతో చలి తీవ్రత పెరిగిపోయింది. ఉదయం పూట హైవే పై దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని. దీంతో వాహనదారులు ఎంతో ఇబ్బందిపడుతున్నారు. ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో పొగమంచి విపరీతంగా కమ్మేసింది. దీంతో విమాన, రైలు రాకపోకలపై ప్రభావం పడింది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఒకేసారి 100 కు పైగా విమానాలను రద్దు చేసినట్లు తెలుస్తుంది. అంతేకాదు 300 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు సమాచారం. మరోవైపు పొగమంచు కారణంగా సుమారు వంద రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఢిల్లీలో పొగమంచు పరిస్థిసి నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్ పోర్ట్ ప్రయాణికులకు కీలక సూచన జారీ చేసింది. ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ విమానాల స్టేటస్ చెక్ చేసుకోవాలని తెలిపింది. ఎయిర్‌లైన్ సిబ్బంది వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, ఢిల్లీ విమానాశ్రయ అధికారులతో సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపింది. భద్రతా ప్రోటోకాల్ కు అనుగుణంగా పనిచేస్తున్నాయని ఎయిర్‌లైన్స్ పేర్కొంది. మరోవైపు ఇండిగో, ఎయిర్ ఇండియా వాతావరణ పరిస్థితిలు దృష్ట్యా పలు విమానాలు రద్దు కాగా, మరికొన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని తెలిపింది. విమానాల స్టేటస్ గురించి తెలుసుకోవాలంటే వెబ్ సైట్స్ కి వెళ్లి చెక్ చేసుకోవాల్సిందిగా సూచించింది.

## అందుకే కాంగ్రెస్‌లో చేరాను

హైదరాబాద్,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై కాంగ్రెస్ సీనియర్ నేత, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుతో ఉన్న గొడవల వల్లే తాను గతంలో బీఆర్ఎస్‌ను వీడానని కవిత మాట్లాడుతున్న మాటల్లో వాస్తవం లేదని అన్నారు.కవిత చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. జగ్గారెడ్డి ఆదివారం రోజున మీడియాతో మాట్లాడుతూ.... మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆహ్వానం మేరకే తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని తెలిపారు. హరీష్ రావుతో విభేదాల కారణంగానే తాను కాంగ్రెస్‌లో చేరానన్న కవిత వాదనలను ఆయన తోసిపుచ్చారు.హరీష్ రావుతో తనకు ఎప్పుడూ రాజకీయ వైరం మాత్రమే ఉంటుందని, ఎలాంటి వ్యక్తిగత శత్రుత్వం లేదని స్పష్టం చేశారు. హరీష్ రావు రాజకీయాలు, నా రాజకీయాలు పూర్తిగా భిన్నమైనవని... తాను కోపంతోనో లేదా ఆయనకు వ్యతిరేకంగానో బీఆర్ఎస్ పార్టీని వీడలేదని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కావడం వల్లే కవిత రాజకీయాల్లోకి వచ్చారని అన్నారు. తండ్రి చాటు బిడ్డగానే ఆమెకు గుర్తింపు ఉందని విమర్శించారు. కానీ, తాను తన రాజకీయ జీవితాన్ని స్వతంత్రంగా ప్రారంభించానని... తన సొంత బలంపై, ప్రజల మద్దతతో రాజకీయంగా ఎదిగానని తెలిపారు. కవిత కుటుంబ అంతర్గత వివాదాల్లోకి తన పేరును ఎందుకు అనవసరంగా లాగుతున్నారు? అని ఆయన ప్రశ్నించారు.కవిత అభిమాన సంఘాల పేరుతో తనపై సోషల్ మీడియాలో తప్పుడు వీడియోలు పెడుతున్నారని జగ్గారెడ్డి మండిపడ్డారు. ఇలాంటి చిల్లర ట్రిక్స్ మానుకోవాలని, ఇప్పటికైనా తనపై నిరాధారమైన ఆరోపణలు చేయడం ఆపేయాలని కోరారు.అప్పట్లో ఎమ్మెల్యేగా ఉండి సంగారెడ్డిలో రెండు మున్సిపాలిటీలను గెలిపించిన తన పనితీరును చూసి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ముగ్ధుడయ్యారని... తనను మెచ్చుకొని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారని చెప్పారు. తమ ప్రాంతానికి ఐఐటీ, నాలుగు లేనర్ల జాతీయ రహదారితో సహా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వాగ్దానం చేశారని... అందుకే తాను కాంగ్రెస్‌లో చేరానని జగ్గారెడ్డి వివరించారు.అయితే జిల్లాలో రాజకీయ కక్షలు కొనసాగుతున్నాయని జగ్గారెడ్డి ఆరోపించారు. సంగారెడ్డిలో రాహుల్ గాంధీ సభ విజయవంతమైన తర్వాత తన రాజకీయ పతనానికి హరీష్ తన వంతు ప్రయత్నం చేశారని జగ్గారెడ్డి ఆరోపించారు. ఇతరుల మాదిరిగా కాకుండా తాను ప్రత్యక్ష రాజకీయాలను నమ్ముతానని, ఇటీవల జరిగిన కొన్ని పరిణామా లతో తాను కలత చెందానని... వాటి గురించి మే నెలలో మాట్లాడుతానని ఆయన అన్నారు. ప్రచార కమిటీ చైర్మన్ పదవిపై తనకు ఆసక్తి లేదని కూడా ఆయన స్పష్టం చేశారు.

## ఎన్నికల అధికారిపై గ్రామస్థుల ఆగ్రహం

సూర్యాపేట,ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల హడవుడి నడుస్తుంది. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం.. సీతారామపురం గ్రామంలో ఎన్నికల అధికారి నాగరాజును గ్రామస్థులు ఓ గదిలో బంధించారు. ఎన్నికల అధికారి ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని.. ఉపసర్పంచ్ పదవిని ముందుగానే ప్రకటించారని గ్రామస్థులు ఆరోపిస్తునున్నారు. నాగరాజు వ్యవహారంపై గ్రాస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన్ని గదిలో బంధించారు. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ఘటనపై అధికారులు, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయమ్పై ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు సంబరాలు చేసుకుంటే.. ఓడిన అభ్యర్థులు కొన్నిచోట్ల ఆందోళన చేస్తున్నారు. తమ వద్ద డబ్బు తీసుకొని వేరే వాళ్లను గెలిపించారని ఆరోపిస్తూ.. తిరిగి డబ్బు చెల్లించాల్సిందిగా ఓటర్లను ఒత్తిడి చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గెలిచిన అభ్యర్థులపై ఓడిన అభ్యర్థులు దాడులకు పాల్పడుతున్నారు. వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు.

## ఆలయంలో దర్శన వేళల్లో మార్పులు

న్యూఢిల్లీ,ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌లోని ఓ ఆలయంలో దర్శన వేళల్లో మార్పు కేసు విచారణలో భాగంగా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది బృందావన్‌లో గల బాంకీ బిహారీజీ ఆలయం లో దర్శన వేళలు, పూజా విధానాల్లో మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం భక్తుల నుంచి డబ్బులు తీసుకుని ప్రత్యేక పూజలు చేయడంపై అసహనం వ్యక్తం చేసింది. దేవుని విశ్రాంతి వేళల్లో ప్రత్యేక పూజలు చేయడం సమంజసం కాదని వ్యాఖ్యానించింది. ఈ కేసులో దర్యాప్తునకు ఉన్నత స్థాయి ఆలయ నిర్వహణ కమిటీని నియమించింది. బాంకీ బిహారీజీ ఆలయంలో దర్శన వేళల్లోనే కాకుండా.. పలు మతపరమైన పూజా విధానాల్లోను మార్పులు చేస్తున్నట్లు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్, న్యాయవాది తన్వి దూబే అత్యున్నత న్యాయస్థానానికి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం దేవుడికి విశ్రాంతి వేళలు ఉంటాయని.. కానీ ఆ సమయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని అన్నారు. దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దేవతలకు విశ్రాంతినివ్వకుండా ప్రత్యేక పూజలు చేయాల్సిన అవసరమేంటని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఆచారం ప్రకారం వస్తున్న పవిత్రమైన ఆలయ నియమాలను, సమయాలను పాటించాలని ఆలయ అధికారులను ఆదేశించింది. ఆలయ నిర్వహణ కమిటీతో సహా సంబంధిత పార్టీలకు నోటీసులు ఇవ్వాలని దర్యాప్తు కమిటీని ఆదేశించింది.

# డ్రగ్స్‌పై పోరు.. పెరగాలి జోరు



హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లో చాపకింద నీరులా విస్తరిస్తూ, యువత జీవితాలను నాశనం చేస్తున్న సమస్యల్లో డ్రగ్స్ వినియోగం ముందువరసలో ఉంది. గతంలో పంజాబ్ వంటి సరిహద్దు రాష్ట్రాలకు, మెట్రో నగరాలకే పరిమితమైన ఈ జాడ్యం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలకు, పట్టణాలకు వేగంగా విస్తరిస్తోంది. తెలంగాణలోని హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్టణం నగరాలలో డ్రగ్స్, గంజాయి వినియోగం బాగా పెరిగిందని పోలీసులు చెబుతున్నప్పటికీ, నిజానికి ఈ జాడ్యం ఉభయ రాష్ట్రాలలోని ద్వితీయ శ్రేణి నగరాలు, పట్టణాలకు వ్యాపించిందనేది బహిరంగ సత్యమే. వాడుతున్న మత్తుమందుల్లో తేడా ఉండొచ్చేమో గానీ, మత్తు ప్రభావం మాత్రం చాపకింద నీరులా వేగంగా తెలుగు నేల మీద విస్తరిస్తోంది. నగర ప్రాంతాల్లో ఐటి, సేవా రంగాలకు చెందిన కార్పొరేట్ ఉద్యోగులు వారాంతాలలో పబ్‌లలో పార్టీల పేరుతో డ్రగ్స్ తీసుకోవటం కామన్‌గా మారగా, సినీ, వ్యాపార, ఇతర ఉన్నత వర్గాల యువత జీవన శైలిలో ఇదొక భాగంగా మారింది.ముఖ్యంగా రేవ్ పార్టీల సంస్కృతి, గత ప్రభుత్వాల పట్టింపులేనితనం డ్రగ్స్ వినియోగం నానాటికీ పెరిగేందుకు దోహదపడ్డాయి. పదేళ్ల నాడు హైదరాబాద్‌లోని కొన్ని ఉన్నత వర్గాలకే పరిమితమైన డ్రగ్స్ వినియోగం నేడు రాజధాని శివారులోని ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలకూ పాకి, ఇప్పుడు జిల్లాల ప్రధాన పట్టణాలకూ విస్తరించింది. గంజాయి మొదలు కొకైన్ వినియోగానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు అలవాటు పడ్డారని, చివరికి చాక్లెట్లు, లిక్విడ్ రూపంలోనూ వాడుతున్నారని పోలీసులు చెబుతున్నారు. గతంలో కేసులు పెట్టి చేతులు దులుపుకోవటం తప్ప చేసిందేమీ లేదని, ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో డ్రగ్స్ కేసుల విచారణమీద ప్రభుత్వ పెద్దల ఒత్తిడి ఉండటంతో నాటి కేసులు నిర్వీర్యమయ్యాయనేది బహిరంగ సత్యమే. అటు ఏపిలోని మన్యం నుంచి వేలాది కిలోల గంజాయి రవాణా సమయంలో ఇతర రాష్ట్రాలలో పట్టుబడింది. గత ఐదేళ్లలో నేతల అక్రమార్జనకు ఇదొక వనరుగా మారింది. దీంతో గతంలో ఎన్నడూ లేనంతగా ఏపిలో గంజాయి వినియోగం పెరిగిపోయిందని పోలీసులు చెబుతున్నారు. దీనికి బానిసైన యువత పలు హింసాత్మక ఘటనలకు, దోపిడీలకూ పాల్పడటం జరుగుతోంది. గతంలో హై క్లాస్ రేవ్ పార్టీలు, పబ్బుల్లో మాత్రమే దొరికే డ్రగ్స్, గంజాయి వంటివి.. నేడు వీధి చివర కిరాణా దుకాణాలు, పాన్ షాపుల్లో పట్టుబడటం పోలీసుల మాటను బలపరుస్తోంది.కింది స్థాయి వరకు ఇంతగా డ్రగ్స్ వినియోగం పాకిందంటే.. డ్రగ్స్ రవాణా, పంపిణీ వెనక ఒక బలమైన నెట్‌వర్క్ పనిచేస్తోందని స్పష్టంగా అర్థమవుతోంది. కానీ, నేటి వరకు డ్రగ్స్ వాడే వారినే అరెస్టు చేసి, కోర్టులో విచారణకు నిలపటం తప్ప డ్రగ్స్ రవాణ, పంపిణీలో కీలక సూత్రధారుల్లో ఒక్కరినీ పోలీసులు పట్టుకోలేకపోవటం వెనక బలమైన కారణాలే ఉన్నాయి. తెలంగాణలో గత ఏడాది కాలంగా తరచూ పోలీసులు హొటళ్లు, పబ్‌లమీద దాడులు, తనిఖీలు పెరిగాయి. తెలంగాణలోని సినిమా పరిశ్రమ ప్రభుత్వ సహకారం పొందాలంటే.. సినీ ప్రముఖులంతా డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో భాగస్వాములు కావాల్సిందేనని తెలంగాణ సిఎం గతంలోనే స్పష్టం చేశారు. పరిశ్రమలోని నటీనటులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తయారయ్యే షార్ట్ ఫిలిమ్స్‌లో తమ సందేశాలను ఇవ్వాలని, వాటిని థియేటర్లు ఉచితంగా ప్రదర్శించాలని, అప్పుడే టికెట్ ధరలు పెంచటానికి అనుమతిస్తామని తనను కలిసిన సినీ పరిశ్రమ ప్రముఖులకు తేల్చి చెప్పారు. ఈ క్రమంలో డ్రగ్స్ వినియోగంపై మెగాస్టార్ చిరంజీవి ఓ వీడియో తీసి పంపి మిగిలిన నటులకు ఆదర్శప్రాయులుగా నిలిచారు. అలాగే, తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరోకు 27 కార్లు, 59 బైకులు సమకూర్చటం, డ్రగ్స్ కట్టడిలో చురుగ్గా పనిచేసే అధికారులకు ప్రమోషన్లు ఇస్తామని ప్రకటించటమూ ఆహ్వానించదగిన పరిణామాలే.డ్రగ్స్ వినియోగంపై సమాచారం తెలిసిన వారు 87126 71111 నంబరుకు ఫోన్ చేసి నార్కోటిక్స్ విభాగానికి సమాచారం ఇవ్వాలని కూడా సిఎం పిలుపునిచ్చారు. అటు ఏపిలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమూ ఈ వ్యవహారంపై గట్టిగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే దీనిపై ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తోంది. గంజాయి సాగు చేసే వారి మీద చర్యలు తీసుకోవటమేగాక వారికి పెట్టుబడి పెడుతున్న వ్యక్తులెవరనే కోణంలోనూ విచారణ సాగుతోంది. తీరప్రాంతంలోని నౌకల నుంచి డ్రగ్స్ దిగుమతి కాకుండా చూడటం, ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలకు గట్టిగా నిఘా పెట్టాలని సూచించటం వంటి చర్యలు తీసుకున్నారు. గంజాయి సేవించి బహిరంగ ప్రదేశాల్లో ప్రజలమీద దాడులు చేస్తున్న బ్లేడ్ బ్యాచ్ ఆగడాలకూ పోలీసులు చెక్ పెడుతున్నారు. ముఖ్యంగా ఏపిలో గంజాయి సరఫరా నెట్‌వర్క్‌ను ఛేదించే దిశగా సర్కారులోని సంబంధిత విభాగాలు అడుగులు వేస్తున్నాయి. మాదక ద్రవ్యాలను సరఫరా చేసేవారు సాధారణంగా యుక్త వయస్కులను లక్ష్యంగా చేసుకుంటున్నారని, నూటికి 90 శాతం కేసుల్లో ఇది సిగరెట్, మద్యంతో అలవాటవుతోందని నిపుణులు చెబుతున్నారు. మాదకద్రవ్యాల సరఫరా ఒక చెయిన్‌లా సాగుతుందని, ఈ నెట్‌వర్క్‌ను బ్రేక్ చేయగలిగితే తొలినాళ్లలోనే చాలామందికి డ్రగ్స్ అందకుండా చూడొచ్చనేది వారి వాదన.డ్రగ్ డీలర్లు ఉన్నత వర్గాల యువతను హైక్లాస్ పార్టీలకు పిలిచి ఉచితంగా మద్యం సరఫరాతో మొదలుపెట్టి, వారిని క్రమంగా డార్క్‌వెబ్‌కు కనెక్ట్ చేసి డెలివరీ బాయ్స్ ద్వారా డ్రగ్స్‌ను ఇంటికే సరఫరా చేస్తున్నారని కూడా తమ కౌన్సిలింగ్‌లో తెలుస్తోందని డిఎడిక్షన్ సెంటర్ నిపుణులు వెల్లడిస్తున్నారు. పిల్లల ప్రవర్తనలో అసాధారణ రీతిలో మార్పులు కనిపిస్తున్నా, సాధారణ స్థాయిని మించి డబ్బులు ఖర్చు పెడుతున్నా, ఆ పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని, ఇలాంటి లక్షణాలు కనిపించగానే డిఅడిక్షన్ సెంటర్లను సంప్రదించి, చికిత్సతోపాటు మానసిక కౌన్సెలింగ్ కూడా అందించాలని వారు చెప్పారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు కౌన్సిలింగ్, అవసరాన్ని బట్టి చట్టపరమైన చర్యలతో బాటు స్కూలు స్థాయి నుంచే విద్యార్థులకు ఆయా విద్యాసంస్థల్లో కౌన్సిలింగ్, అవగాహనా శిబిరాలు నిర్వహించాలని వారు సూచిస్తున్నారు. డ్రగ్స్ వినియోగం, పంపిణి, సరఫరామీద విశేషమైన ప్రచారం, అవగాహన ఉన్నప్పుడే డ్రగ్స్ వినియోగం కట్టడి అవుతుంది. దీనికోసం అటు ప్రభుత్వాలు, ఇటు స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రముఖులు, విద్యా సంస్థల యాజమాన్యాల చొరవ కూడా కీలకమే. ఈ గలీజు దందా నడిపే వారి పట్ల కఠినంగా ప్రభుత్వాలు వ్యవహరించగలిగితేనే ఈ జాడ్యం దూరమవుతుంది. లేదంటే.. ఈ జాడ్యం మొత్తం సమాజాన్ని పెకలించకమానదు. కనుక ఇకనైనా, మాదకద్రవ్యాల మీద పోరులో మన ప్రభుత్వాలు మరింత దూకుడుగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### బిజెపి నుంచి కూతురు సర్పంచ్..బిఆర్ఎస్ నుంచి తండ్రి ఉప సర్పంచ్

జనగామ,రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో పలు ఆసక్తికర ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా జనగామ జిల్లా వెంకిర్యాల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. వెంకిర్యాలలో బీజేపీ బలపరిచిన గొల్లపల్లి అలేఖ్య సర్పంచ్‌గా విజయం సాధించగా, ఆమె తండ్రి గొల్లపల్లి పర్శయ్య ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ ఎన్నికల్లో వార్డు సభ్యులు బీఆర్ఎస్,

# బిజెపి స్వయం కృతం !

హైదరాబాద్,పంచాయితీ ఎన్నికల్లో బిజెపి చతికిల పడింది. వచ్చిన సీట్లను చూసి మురిసిపోతై మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. కనీసం మూడో స్థానంలో ఉండాల్సిన సంఖ్యలో కూడా సర్పంచ్ పదవులను గెల్చుకోఏక పోయింది. ఈ క్రమంలో ఇక కాషాయ పార్టీ బలపడడం ఇప్పట్లో అసాధ్యమన్న భావన వస్తోంది. ప్రజలు మందలించినా, ప్రజలు ఛీత్కరించుకుంటున్నా..తెలంగాణ బిజెపిలో మార్పు కానరావడం లేదు. అధికార కాంగ్రెస్‌ను విమర్శించడమే లక్ష్యంగా పార్టీ ప్రస్థానం సాగుతోంది. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా చెప్పుకోదగ్గ రీతిలో రాష్ట్రానిక నిధులు విడుదల జరగడం లేదు. పనులు సాగడం లేదు. ఇది గత పుష్కరకాలంగా ఇలాగే సాగుతోంది. ఈ క్రమంలో ప్రజలు బిజెపిని ఎందుకు నమ్ముతారన్నది గమనించడం లేదు. పక్కన ఏపిలో బిజెపి నేతలు కేందరం నుంచి అనేక పనులు రాబట్టుకుంటున్నారు., ప్రాజెక్టులను సాధిస్తున్నారు. కానీ తెలంగాణలో కనీసం రోడ్లకు దిక్కులేదు. కంటోన్మెంట్ భూములల బదలాయింపుకు ఇప్పటికీ పేచీలు తప్పడం లేదు. రాష్ట్రం ఏదైనా కోరితే కొర్రీలు తప్ప మరోటి కానరావడం లేదు. ఇద్దరు కేంద్రమంత్రులు, మరో ఏడుగురు ఎంపిలు ఉన్నా లాభం కనిపించడం లేదు. అందుకేనేమో బిజెపి పని తీరుపై ఇటీవల ప్రధాని మోడీ గట్టిగానే హెచ్చరించారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, మరో ఎనిమిది మంది ఎంపీలు పార్టీకి ఉన్నా బలమైన పార్టీగా ఉంటూ.. రాష్ట్రానికి ఎంతో చేయవచ్చు. అలాగే ఓబిసి మోర్చా నేతగా మరో రాజ్యసభ ఎంపి లక్ష్మణ్ కూడా ఉన్నారు. వీరంతా కాంగ్రెస్‌ను తిట్టిపోయడం తప్ప మరో పని పెట్టుకోలేదు. దీనికితోడు అంతర్గత కుమ్ములాటలు గతంలో ఎప్పుడూ లేనంతగా కనిపిస్తు న్నాయి. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు విమర్శలకే పరిమితం అవుతున్నారు. ప్రజలను అకకున చేర్చుకునే పనులేవీ కనిపించడం లేదు. దాదాపు ఐదేళ్ల క్రితం జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మేయర్ పీఠానికి చేరువగా వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని, అప్పుడు ఒకటి రెండు సీట్లకు పరిమితం చేసి ప్రధాన ప్రతిపక్షంగా బీజేపీ అవతరించింది. ఆ తర్వాత బండి సంజయ్ నాయకత్వంలో మరింత దూకుడు ప్రదర్శించింది. ఈ నేపథ్యంలో శాసనసభ ఎన్నికలకు ముందు బండి సంజయ్ నాయకత్వాన్ని మార్చారు. ఎందుకు మార్చారో తెలియదు. కానీ అప్పటి నుంచి పార్టీ దూకుడు తగ్గింది. ఆ ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై పడింది. అధికారంలోకి వస్తామనుకున్న బిజెపిని ప్రజలు పక్కన పెట్టారు. ఇప్పుడ సర్పంచ్ ఎన్నికల్లో కూడా గట్టిగా బుద్ధి చెప్పారు. రెండువిడతల్లో కలిపి స్వతంత్రులకు వచ్చిన స్థానాలు కూడా రాలేదు. పంచాయితీ ఎన్నికల్లో సత్తా చాటలేదు. జూబ్లీహిల్స్ ఎన్నికలో డిపాజిట్ కోల్పోయారు. అయినా వారిలో పరివర్తన కానరావడం లేదు. ఆత్మపరిశీలన చేసుఓవడం లేదు. దీనికితోడు బండి, ఈటెల మధ్య అంతర్గత కుమ్ములాటలు రాజుకుంటున్నాయి. పార్టీ రాష్ట్ర నాయకుల మధ్య నెలకొన్న అంతర్గత కుమ్ములాటలు మరొక కారణంగా పార్టీ అడుగులు ముందుకు పడడం లేదు. రెండేళ్ల క్రితం రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పట్టుదలతో వివిధ పార్టీలకు చెందిన బలమైన నాయకులను బీజేపీలో చేర్చుకున్నారు. దీంతో భవిష్యత్తుపై పార్టీ శ్రేణుల్లో ఆశలు




చిగురించాయి. ఈ నేపథ్యంలో శాసనసభకు ఎన్నికలు రావడం, పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి బండి సంజయ్‌ను తప్పించడం జరిగింది. దీంతో ఎందుకనో ప్రజలు బిజెపి పట్ల నమ్మకాన్ని కోల్పోయారు. బిఆర్ఎస్‌తో కుమ్మక్కయ్యారన్న వార్తలు బలంగా ప్రసారం కావడంతో బిజెపికి ఎదురుదెబ్బలు తప్పడం లేదు. రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి బిజెపి స్వయంకృతాపరాధం తప్ప మరోటి కాదు.. ఆ తర్వాత ఆరు నెలలకు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి చెందిన బలమైన నాయకులను బీజేపీ కేంద్ర నాయకత్వం ఎన్నికల బరిలోకి దించింది. దీంతో కాంగ్రెస్‌తో సమానంగా ఎనిమిది స్థానాలను పార్టీ గెలుచు కోగలిగింది. ఆ తర్వాత నుంచి రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి కష్టాలు మొదలయ్యాయి. నివురుగప్పిన నిప్పులా పార్టీలో ఉన్న అంతర్గత కుమ్ములాటలు పార్టీని దెబ్బతీశాయి. గ్రేటర్ హైదరాబాద్ లో పార్టీ మొదటి నుంచీ బలంగా ఉండేది. ఎమ్మెల్యే రాజాసింగ్ లాంటి వారు ఇదే విషయమై నిలదీస్తున్నా కేంద్ర నాయకత్వం పట్టించుకోలేదు. ఆయనను పార్టీలో కొనసాగించేందుకు ఎవ్వరు కూడా ప్రయత్నించలేదు. అందుకే బిజెపి బలం 8 నుంచి ఏడుకు పడిపోయింది. కేంద్రంలో అధికారంలో ఉన్నందున లబ్ది పొందాల్సిన పార్టీ ఆ దిశగా కృషి చేయడంలేదు. మరోవైపు కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయమని ప్రజలను నమ్మించే దిశగా కూడా పనిచేయడం లేదు. ప్రజా బలం ఉన్న నాయకులు పార్టీలో చేరినప్పటికీ పార్టీలో ఛరిష్మా లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే బీసీ నాయకత్వం అంశం కూడా తెరపైకి వచ్చింది. పార్టీకి బీసీలే నాయకత్వం వహించాలన్న డిమాండ్ అంతర్గతంగా బలపడుతూ వచ్చింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ కూడా బీజేపీ తన పట్టును ప్రదర్శించలేక పోయింది. తాజాగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కూడా పార్టీ పరిస్థితి అధ్వానంగా మారింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో కూడా సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ పనితీరు పేలవంగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల తర్వాత పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ప్రయత్నాలు జరిగిన దాఖలాలు లేవనడానికి సర్పంచ్ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. తిరువనంతపురంలో గెలిచిన బిజెపి తెలంగాణలో మాత్రం చతికిల పడింది. ఇందుకు పార్టీ నేతల లోపభూయిష్ట విధానాలే కారణంగా చూడాలి.

## వేధింపులపై కమిటీతో విచారణ

హైదరాబాద్,కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో లైంగిక వేధింపుల వ్యవహారం కలకలం రేపింది. అయితే ఈ ఆరోపణలపై వర్సిటీ ప్రిన్సిపాల్ లోక పావని స్పందించారు.మెస్ ఇంచార్జ్ వినోద్ తప్పు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసులతో పాటు యూనివర్సిటీ నుంచి ప్రత్యేక కమిటీని వేసి విచారిస్తున్నామన్నారు. విద్యార్థులపై వేధింపులు జరిగాయని స్థానిక పోలీసులు ఇప్పటికే సమాచారం అందించారని.. వేధింపులపై హాస్టల్ వార్డెన్‌కు, ప్రిన్సిపాల్‌కు విద్యార్థులు గతంలో ఎలాంటి ఫిర్యాదులు చేయలేదని తెలిపారు. మెస్ ఇంచార్జ్ వినోద్‌పై గతంలో ఎలాంటి ఆరోపణలు లేవని అన్నారు. లైంగిక వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థులు ఎవరో తెలియదని చెప్పారు. ఫిర్యాదు చేసిన విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోని టార్గెట్ చెయ్యమని స్పష్టం చేశారు. విద్యార్థులకు సమస్యలుంటే మొదటగా తమకు చెప్పాలని కోరారు. విద్యార్థులు అభద్రతా భావానికి గురి కావద్దని సూచించారు. యూనివర్సిటీ, హాస్టల్ మెస్‌లో విద్యార్థుల వసతులకు సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. హాస్టల్‌లో తక్కువ స్థలంలో ఎక్కువ మంది విద్యార్థులు వసతి ఉంటున్నారని తెలిపారు. సీసీ కెమెరాలు కొరత వేధిస్తోందని చెప్పారు. ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా వర్సిటీ ప్రిన్సిపాల్ లోక పావని కోరారు.

## గాయకుడు బాలు అందరివాడు

హైదరాబాద్, ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందదాయకమని, బాలును అభిమానింగా గౌరవించుకోవడం తెలుగువారిగా మనకంతా గర్వకారణమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. రవీంద్ర భారతి ప్రాంగణంలో ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్ బాబు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతోపాటు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అనంతరం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భావితరాల కోసమే రవీంద్రభారతి లో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. స్వర సార్వభౌమత్వానికి బాల సుబ్రహ్మణ్యం నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. నెల్లూరులోని తన ఇంటిని వేద పాఠశాలకు బాలు ఇచ్చేశారని గుర్తు చేశారు. బాలు మన మధ్య లేకున్నా.. పాట రూపంలో మనతోనే ఉన్నారని చెప్పారు. ప్రతిఒక్కరి మనస్సులో బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. తన తండ్రి, ప్రముఖ గాయకుడు బాల సుబ్రహ్మణ్యం రాజకీయాలకు అతీతంగా ఉండేవారని ఎస్పీ చరణ్ గుర్తుచేసుకున్నారు. ఆయనకు అందరూ ఒకటే అని పేర్కొన్నారు. రవీంద్ర భారతి ఆవరణలో ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో చరణ్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం, తెలుగు ప్రజలు, బాలు విగ్రహం ఏర్పాటుకు నాలుగేళ్లుగా కృషి చేసిన బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి అందరితో ఎంత స్నేహపూర్వకంగా ఉండేవారన్న దానికి ఈ కార్యక్రమం ఓ నిదర్శనమన్నారు. మరోవైపు.. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ వాదులు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతోపాటు ఉద్యమకారుడు పృథ్వీరాజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో విగ్రహ ఆవిష్కరణ సమయంలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన తెలంగాణ వాదులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రవీంద్ర భారతితో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు.

## మార్పు' రాజకీయం!

హైదరాబాద్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో స్వంతపార్టీ కాంగ్రెస్‌లో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీలో నిన్నటి వరకు ఉన్న సమీకరణలు ఒక్కసారిగా మారిపోతున్నాయి. దీంతో ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఒంటరైన మంత్రి కొండా సురేఖ దంపతులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో సైతం ఒంటరిగా మారుతున్నారనే చర్చ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీలో ప్రారంభమైన ఈ మార్పు ప్రభావం వరంగల్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాలపై ప్రభావం చూపుతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. తూర్పులో పార్టీ లేదా ప్రభుత్వ కార్యక్రమాలుగానీ తాము చెప్పినట్లే సాగాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం తాము గీసిన గీత దాటొద్దొంటూ 'పట్టు' బిగించేందుకు ప్రయత్నించిన కొండా దంపతులకు తమ అనుచరుల నుంచే వ్యతిరేకత ప్రారంభమైందన్న చర్చలు నడుస్తున్నాయి. ఈ వ్యతిరేకత నుంచే పార్టీలో సమీకరణలు మారుతున్నాయని జిల్లా రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.మొన్నటి వరకు కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా సురేఖ వ్యతిరేక వర్గానికి చెందిన ఎర్రబెల్లి స్వర్ణ బాధ్యతలు నిర్వహించారు. కొండా దంపతులకు, స్వర్ణకు మధ్య ఉప్పునిప్పుగానే సాగింది. ఇటీవల నూతన డీసీసీ అధ్యక్షుల నియాకమంతో వరంగల్ తూర్పునకు చెందిన మైనార్టీ నాయకుడు అయూబ్ కు జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించి కాంగ్రెస్ పార్టీ అందరినీ ఆశ్చర్యపరిచింది. అయూబ్‌కు వర్గ ముద్రలు లేకపోవడంతో కొండా దంపతులు నూతన అధ్యక్షుడితో సఖ్యతతో వ్యవహరిస్తారని అంతా భావించారు. అయూబ్ ఆధ్వర్యంలో పార్టీ అధినేత్రి సోనియా జన్మదినోత్సవం పార్టీ అంతాకలిపి జరిపితే కొండా వర్గం నాయకులు దీనికి దూరంగా ఉన్నారు. ఆ వర్గం వేరే కార్యక్రమాన్ని నిర్వహించారు. తూర్పులో తమ విజయానికి కారణమైన మైనార్టీలకు ప్రతినిధిగా ఉన్న అయూబ్‌ను సైతం కొండా వర్గం పట్టించుకోకుండా అవమానించిందనే కొత్త చర్చకు దారితీసింది.

ఒంటరైన కొండా దంపతులు!

కొండా దంపతుల తీరుకు వ్యతిరేకంగా ఇప్పటి వరకు వారికి మద్ధతు తెలియజేసిన పార్టీ నాయకులతో పాటు, కొండా వ్యతిరేక వర్గం నాయకులు, అయూబ్ అనుకూలురంతా కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించి, కలిసి కట్టుగా సాగాలని నిర్ణయించడం ఇప్పుడు తూర్పులో హాట్ టాపిక్ గా మారింది. దీంతో ఒక్కసారిగా తూర్పు కాంగ్రెస్ రాజకీయాల్లో వేడిపెరిగింది. కొండ దంపతుల అనుచరుడిగా గుర్తింపు పొందిన నల్లగొండ రమేష్ ఇంట్లో కాంగ్రెస్ పార్టీ నాయకులంతా సమావేశమై మంతనాలు జరపడం ఇప్పుడు అనూహ్యపరిణామంగా చెప్పవచ్చు. ఈ సమావేశానికి కొండా వ్యతిరేక వర్గ నాయకుడు ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య హాజరుకావడం సీరియస్ పరిణామంగా భావిస్తున్నారు. కొండా దంపతులు ఒకవైపు తూర్పు ముఖ్య నేతలు మరోవైపు అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. కొండా వర్గం తమకు కనీస న్యాయం చేయడంలేదనే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ పదవులతోపాటు, ఇప్పటి వరకు తూర్పునకు నామినేటెడ్ పదవులు రాని అంశం చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. వరంగల్ తూర్పు కాంగ్రెస్ నాయకులంతా నూతన అధ్యక్షుడు అయూబ్, మాజీ మంత్రి సారయ్య నాయకత్వంలో పీసీసీ

# పహల్గాం ఉగ్రదాడి కేసు.. జమ్మూలోని ప్రత్యేక కోర్టులో ఛార్జిషీటు దాఖలు



న్యూఢిల్లీ, పహల్గాం ఉగ్రదాడి కేసులో దర్యాప్తు చేస్తున్న నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ సోమవారంనాడు జమ్మూలోని ప్రత్యేక కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. దాడి ప్రధాన సూత్రధారిగా పాకిస్థాన్ నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న లష్కరే తొయిబా కమాండర్ జాజిద్ జాట్ ను పేర్కొంది. హహల్గాం దాడి కేసులో లష్కరే తొయిబా, దాని ఫ్రంట్ ఆర్గనైజేషన్ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'తో సహా ఏడుగురు నిందితులపై ఎన్ఐఏ ఛార్జిషీటు నమోదు చేసింది. హహల్గాం దాడిలో పాకిస్థాన్ కుట్ర, నిందితుల పాత్ర, వాటిని బలపరచే సాక్ష్యాలను ఛార్జిషీటులో ఎన్ఐఏ చేర్చింది. నిషేధిత ఎల్ఈటీ/టీఆర్ఎఫ్ సంస్థ ఈ కుట్రకు ప్రణాళిక రచించి దాన్ని అమలు చేసినట్టు తెలిపింది. మతం పేరు అడిగిమరీ పాక్ స్పాన్సర్డ్ ఉగ్రవాదులు ఈ దారుణానికి పాల్పడ్డారని, ఒక పౌరుడు సహా 25 మంది టూరిస్టులను పొట్టనపెట్టుకున్నారని పేర్కొంది. ఈ మేరకు 1,597 పేజీల ఛార్జిషీటును ప్రత్యేక కోర్టుకు ఎన్ఐఏ సమర్పించింది. ఉగ్రదాడి అనంతరం జూలైలో చేపట్టిన ఆపరేషన్ మహదేవ్‌లో భారత బలగాలు మట్టుబెట్టిన ముగ్గురు పాక్ ఉగ్రవాదుల పేర్లను కూడా ఛార్జిషీటులో ఎన్ఐఏ చేర్చింది. ఈ ఉగ్రవాదులను ఫైసల్ జాట్ అలియాస్ సులేమాన్ షా, హబీబ్ తాహిర్ అలియాస్ జిబ్రాన్, హమ్జా అఫ్గానిగా పేర్కొంది. ఈ ముగ్గురితో పాటు సాజిద్ జాట్, ఎల్ఈటీ/టీఆర్ఎఫ్‌పై వివిధ సెక్షన్ల కింద అభియోగాలను మోపింది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించారనే కారణంగా జూన్ 22న అరెస్టు చేసిన మరో ఇద్దరు నిందితులు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్‌ల పేర్లను కూడా ఛార్జిషీటులో ఎన్ఐఏ చేర్చింది. ఇంటరాగేషన్‌లో ఈ ఇద్దరూ దాడిలో ప్రమేయమున్న మరో ముగ్గురు సాయుధ ఉగ్రవాదుల వివరాలను వెల్లడించారు. ఈ ముగ్గురూ ఎల్ఈటీ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా పనిచేసిన పాక్ ఉగ్రవాదులని అంగీకరించారు. పాక్‌కు చెందిన మోస్ట్ వాంటెండ్ టెర్రరిస్టు సాజిద్ జాట్. ఇతనిపై ఎన్ఐఏ రూ.10 లక్షల రివార్డు కూడా ప్రకటించింది. అతని అసలు పేరు హబీబుల్లా మాలిక్. పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్‌లోని కసూర్ జిల్లావాసి. సైపుల్లా, నోమి, నూమన్, లంగ్డా, అలీ సాజిద్, ఉస్మాన్ హబీబ్, షాని అనే పేర్లు కూడా ఇతనికి ఉన్నాయి. టీఆర్ఎఫ్ టాప్ కమాండర్‌గా జమ్మూకశ్మీర్‌లో జరిగిన పలు ప్రధాన ఉగ్రదాడుల్లో ఇతని ప్రమేయం ఉంది. 2022 అక్టోబర్‌లో యూఏపీఏ కింద అధికారికంగా వాంటెడ్ టెర్రరిస్టుగా ప్రకటించారు. ఇస్లామాబాద్‌లో ఎల్ఈటీ ప్రధాన కార్యాలయం నుంచి ఇతను భారత్‌లో ఉగ్రవాదాన్ని నడిపించే నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నాడని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. భారత ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారంటూ సాజిత్ జాట్‌పై పలు ఛార్జిషీటు సైతం ఎన్ఐఏ నమోదు చేసింది. కశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత టెర్రర్ నెట్‌వర్క్‌ను నడుపుతున్న అత్యత ప్రమాదకరమైన వ్యక్తుల్లో ఒకరిగా సాజిద్‌ను భద్రతా సంస్థలు చెబుతున్నాయి.

# బిజెపి వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబిన్



న్యూఢిల్లీ,బీజేపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన బీహార్ మంత్రి నితిన్ నబిన్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర పార్టీ నాయకుల సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. బీజేపీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న తర్వాత నితిన్ నబిన్‌కు ఘన స్వాగతం లభించింది. అమిత్ షా, నడ్డా, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, రవిశంకర్ ప్రసాద్, ఢిల్లీ సీఎం రేఖ గుప్తా సహా వివిధ నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం చెప్పారు. అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి నబిన్ మాట్లాడుతూ.. నాలాంటి చిన్న కార్యకర్తకు పార్టీ చాలా పెద్ద బాధ్యత అప్పగించిందన్నారు. కార్యకర్తల నిబద్ధత, కృషిని పార్టీ గుర్తిస్తుందనడానికి ఇదే నిదర్శమని చెప్పారు. దివంగత నవీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా కొడుకే నితిన్ నబీన్. కాయస్త కమ్యూనిటీకి చెందిన ఆయన.. ఇప్పటివరకూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2006లో ఆయన తండ్రి నవీన్ కిశోర్ మరణంతో పాట్నా వెస్ట్ అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు బీజేపీ అధిష్టానం నితిన్‌ను నిలబెట్టింది. అప్పటి నుంచి గత రెండు దశాబ్దాల్లో ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవల ముగిసిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం బంకీపూర్ నియోజకవర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తోన్న నబిన్ బీహార్ ప్రజా పనుల శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ పార్లమెంటరీ బోర్డు పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్?ను నియమించింది. త్వరలోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడిగానూ ఆయనకు బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు బీజేపీ వర్గాల సమాచారం.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీలపై కమీషన్ల కక్కుర్తి



గుంటూరు, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై వైసీపీ ప్రజా ఉద్యమం తీరును అందరూ చూస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు.. గత 18 నెలల కాలంగా వైసీపీ అనేక ప్రజా ఉద్యమాలు చేస్తుందని తెలిపారు.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు, రైతాంగ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుందన్నారు.. తాజాగా వైసీపీ ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో అంబటి మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కమిషన్ల కోసం పీపీపీ అనే దుర్మార్గమైన మోడల్ తెచ్చి అమ్మేసే ప్రయత్నం చేస్తున్నారు.. రాష్ట్రంలో కోటి సంతకాలను సేకరించాలని ప్రతీ ఒక్కరి దగ్గరకు వెళ్ళిందని విమర్శించారు.. నియోజకవర్గాల నుంచి జిల్లా కేంద్రాలకు.. అక్కడ నుంచి కేంద్ర కార్యాలయం వరకు ప్రజల సంతకాలు వచ్చాయన్నారు.. ప్రతి జిల్లాలో వైసీపీ నిరసనలకు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇచ్చారన్నారు.. రాష్ట్రంలో అన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీ ఉండకూడదని భర్తీ చేశారని తెలిపారు.. ఇవాళ జీరో వెకెన్సీ సిస్టమ్ లేదు.. మందులు లేవు.. ప్రజారోగ్యం, విద్య కోసం 17 మెడికల్ కాలేజీలు తెస్తే వాటిని ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు..ఈనెల 18న గవర్నర్ దగ్గరకు వెళ్ళి ఈ సంతకాల రూపంలో ఉన్న ప్రజాభిప్రాయాన్ని తెలియజేస్తామని మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు.. 'గతంలో మేం సెల్ఫ్ ఫైనాన్స్ సిస్టమ్ అంటేనే అలా కదరదన్న చంద్రబాబు ఇప్పుడు ఏకంగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్ర చేస్తున్నారు.. ప్రైవేట్ వాళ్లకు ఇచ్చినా సిబ్బంది జీతాలు మాత్రం ప్రభుత్వం చెల్లిస్తుందట.. ఇది వారికి బొనాంజా ఇచ్చే స్కాం కాదా.. పేదవారి వైద్యాన్ని తాకట్టు పెట్టి కిక్ బ్యాగ్స్ తీసుకోవాలని చూస్తున్నారు.. 33 ఏళ్ల లీజు.. ఆ తర్వాత పొడిగించుకునే అవకాశం.. ఐదేళ్ల పాటు 1000 కోట్లు వ్యయం చేస్తే పేదవారికి ఉపయోగపడతాయి.. ప్రతి దశలో ప్రైవేటీకరణ ఉద్యమాన్ని అణిచివేయాలని చూశారు.. పార్లమెంట్ స్థాయి సంఘం నివేదికలు సైతం వక్రీకరించి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.. పార్లమెంటరీ స్థాయి సంఘం దేశంలో వైద్య కళాశాలలు మరిన్ని రావాలని చెప్పే ప్రయత్నం చేసింది.. రానున్న రోజుల్లో 70 వేల సీట్లు అందుబాటులోకి రావాలని చెప్పారు.. పీపీపీ విధానంలో పన్ను రాయితీ ఇవ్వనున్నారు కానీ ఏకంగా వాళ్లకు కట్టబెట్టమనలేదు.. ఇవాళ వైసీపీ కోటి సంతకాలు అని మొదలు పెడితే దాటిపోయాయి.. రాష్ట్ర ముఖ్యమంత్రి కమిషన్ల కోసం ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేసే ప్రయత్నం మానుకోవాలి.. 18 నెలల్లో ప్రజా వ్యతిరేకత పెరిగిందని వారు గమనించకపోతే వారి కర్మ.. ఇప్పటికైనా చంద్రబాబు పీపీపీ పై పునరాలోచించుకోవాలి.. గవర్నర్ రాష్ట్రానికి సుప్రీం కాబట్టి ఆయనకు ప్రజాభిప్రాయాన్ని తెలియజేస్తున్నాం..అని మాజీ మంత్రి వ్యాఖ్యానించారు.

# వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌కు ఉచ్చు



అమరావతి, వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌కు ఉచ్చు బిగుస్తోంది. హఫీజ్ ఖాన్‌పై విచారణకు ఎస్సీ కమిషన్ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఐదు రోజుల్లో ఆయనపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని జిల్లా ఎస్పీని ఎస్సీ కమిషన్ ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తనకు డిప్యూటీ మేయర్ పదవి ఇస్తానని అప్పటి కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మోసం చేశారంటూ ఫ్యాషన్ డిజైనర్ శోభారాణి డిసెంబర్ 13వ తేదీన ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. డిప్యూటీ మేయర్ పదవికి తనను రూ. 25 కోట్లు డిమాండ్ చేశారని ఎస్సీ కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొంది. తాను అప్పు చేసి రూ. 3.7 కోట్లు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు ఇచ్చినట్లు శోభారాణి వెల్లడించింది. హఫీజ్ ఖాన్ తనపై లైంగిక దాడికి పాల్పడ్డడమే కాకుండా.. తనపై హత్యాయత్నం సైతం చేశాడని శోభారాణి ఆరోపించారు. తనకు, తన కుటుంబ సభ్యులకు హఫీజ్ ఖాన్ నుంచి ప్రాణ హాని ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. నేపథ్యంలో తమకు రక్షణ కల్పించి.. న్యాయం చేయాలని మహిళా కమిషన్‌ను శోభారాణి ఆశ్రయించిన సంగతి తెలిసిందే. హఫీజ్‌ఖాన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఏపీ మహిళా కమిషన్ సైతం ఆదేశించింది. ఇదే విషయంపై గతంలో పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసిన విషయం విదితమే. శోభారాణికి రక్షణ కల్పించి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఇప్పటికే మహిళ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.

# జగన్, షర్మిల ఎడతెగని ఆస్తుల పంచాయతీ..!



హైదరాబాద్,ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి తన సొంత చెల్లి షర్మిలతో ఆస్తుల పంచాయతీ ఎడతెగకుండా సాగుతోంది. ఈ ఆస్తుల పంచాయతీలో జగన్, ఆయన భార్య భారతీ రెడ్డీ ఒక వైపు ఉంటే.. షర్మిలకు మద్దతుగా తల్లి విజయమ్మ నిలిచారు. ముఖ్యంగా సరస్వతి పవర్ కంపెనీ షేర్ల విషయంలో వివాదం హైదరాబాద్ లోని నేషనల్ కంపెనీస్ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) కు ఎక్కింది. ఇరు వర్గాలూ అంటే జగన్ , భారతీ, విజయమ్మ, షర్మిలలు ఒకరిపై ఒకరు ఆరోపణలు గుప్పించుకున్నారు. ఈ కేసులో ఎన్సీఎల్టీలో ఎప్పటికప్పుడు విజయమ్మ, జగన్ లు పిటిషన్లు, కౌంటర్లు దాఖలు చేసుకుంటున్నారు.ఒకరు ముందు దాఖలు చేసిన పిటిషన్ పై మరొకరు కౌంటర్ దాఖలు చేస్తున్నారు. దానినీ కౌంటర్ చేస్తూ మళ్లీ పిటిషన్లు, కౌంటర్లు దాఖలు అవుతున్నాయి. తాజాగా జగన్ రాజకీయంగా, వ్యక్తిగతంగా తన ప్రతిష్ఠను చెల్లి షర్మిల దెబ్బతీయాలని ప్రయత్నించిందంటూ ఎన్సీఎల్టీకి నివేదిక అందించారు. ఈ పరిణామాల నేపథ్యంలో గతంలో చెల్లితో చేసుకున్న ఆస్తుల ఒప్పందాలను రద్దు చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తన కౌంటర్‌లో పేర్కొన్నారు. వివాదానికి కారణమైన ఆస్తులన్నీ తన స్వార్జితమని పేర్కొంటూ జగన్ ఎన్సీఎల్టీలో సమగ్ర కౌంటర్ దాఖలు చేశారు.సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో వాటాల బదిలీ అంశంపై గతంలో వైఎస్ జగన్, వైఎస్ భారతి ఎన్సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తమకు చెందిన షేర్లను అక్రమంగా తల్లి వైఎస్ విజయమ్మ బదిలీ చేశారని ఆరోపిస్తూ, ఆ షేర్ల బదిలీని రద్దు చేయాలని వారు కోరారు. ఈ పిటిషన్‌పై వైఎస్ షర్మిల అప్పీల్ చేయడంతో, ఆమెకు ఈ వ్యవహారంలో ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేవనీ, . అప్పీల్ చేసే అర్హత కూడా షర్మిలకు లేదని జగన్ తన కౌంటర్‌లో పేర్కొన్నారు.చెల్లిపై ఉన్న ప్రేమాభిమానాలతో గతంలో భవిష్యత్తులో ఆస్తులు బదిలీ చేయాలనే ఉద్దేశంతో ఒప్పందం కుదిరిందని పిటిషన్ లో పేర్కొన్న జగన్.. అయితే ఆ మేరకు జరిగిన వాటాల బదిలీకి మూడేళ్లు పూర్తైనప్పటికీ, ఇంతకాలం మౌనంగా ఉన్న షర్మిల ఇప్పుడు అప్పీల్ చేయడం వెనుక ఉద్దేశాలపై సందేహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎన్సీఎల్టీ ఇచ్చిన తీర్పుపై స్టే విధించాలని కోరుతూ, తన వాదనలను ట్రిబ్యునల్ ముందు జగన్ ఉంచారు.

# మెడికల్ కాలేజీలపై దొంగనాటకాలు



అనకాపల్లి,పేద వైద్య విద్యార్థులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలలు నిర్మించాలని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దీన్ని అడ్డుకునేందుకు వైకాపా అధ్యక్షుడు జగన్ దొంగ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. అనకాపల్లిలోని తెదేపా పార్లమెంట్ పార్టీ కార్యాలయంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య కళాశాలల అంశంపై జగన్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చించేందుకు రమ్మంటే రాని ఆయన.. ఇప్పుడు కోటి సంతకాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణాలు చేపట్టారని.. అక్కడ మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగించిన జగన్.. ప్రతిపక్షంలోనూ అదే విధానాన్ని కొనసాగించాలని చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఆ ఆటలు సాగవన్నారు. ఈ సమావేశంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు పీలా గోవింద సత్యనారాయణ, మల్ల సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 'ఫ్యాన్' గాలికి రోజా దూరం దూరం.. వాళ్ల వల్లేనట!



అమరావతి,వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ మంత్రి, నగరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆ పార్టీ నేతలపై గుర్రుగా ఉన్నట్లు తెలుస్తున్నది. పార్టీ నుంచి ఆమెకు ఎటువంటి సహకారం అందడం లేదని, తనను ఇబ్బంది పెడుతున్న వారిపై అధిష్టానానికి ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని ఆమె ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన సమయంలో ఆమె నగరి ఎమ్మెల్యేగా గెలిచారు. అది కూడా భారీ మెజార్టీతో కాదు. సీఎంగా జగన్ ప్రమాణం స్వీకారం చేశాక నేరుగా ఆయన వద్దకు రోజా.. తనను ఎన్నికల్లో ఓడించే కుట్ర జరిగిందని వివరించినట్లు చెప్పుకొచ్చారు.

సొంత మనుషులే వెన్నుపోటు..

వైసీపీలో రోజా ఫైర్ బ్రాండ్‌గా పేరొందారు. 2019కు ముందు ఉన్న అప్పటి టీడీపీ ప్రభుత్వంపై ఆమె పెద్దఎత్తున విమర్శలు చేసేవారు. అప్పటి మంత్రులకు తన విమర్శలతో ముప్పుతిప్పలు పెట్టారు. ఈ క్రమంలోనే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆమె పార్టీకి అందించిన సేవలను గుర్తించిన నాటి సీఎం జగన్ మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అయినప్పటికీ తనకు మంత్రి పదవి రాకుండా కొందరు నియోజకవర్గానికి చెందిన సొంత నేతలే సీఎం వద్ద లాబీయింగ్ చేశారని ఆమె కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. అయితే, రోజా మంత్రి అయ్యాక వారందరికీ మాస్ వార్నింగ్ ఇచ్చారు. తనకు వెన్నుపోటు పొడవాలని చూసిన వారికి గట్టిగానే బదులిచ్చారు.

జగన్ అంటిముట్టనట్టు..

రోజా తనకు జరిగిన అన్యాయాన్ని పలుమార్లు జగన్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని సమాచారం. అందుకే రోజా రోజురోజుకూ ఫ్యాన్‌కు దూరం అవుతున్నారని టాక్ వినిపిస్తోంది. గత ఎన్నికల్లోనూ సొంత నియోజకవర్గ నేతలే ఆమెను ఓడించారని, ప్రత్యర్థి పార్టీతో కుమ్మక్కు అయ్యారని.. తన గురించి ఎన్నికల సమయంలో విషప్రచారం చేశారని ఓటమి అనంతరం ఆమె కన్నీటిపర్యంతం అయ్యారు. ఇప్పటికీ నియోజకవర్గంలో ఆమెకు ఆదరణ అంతంత మాత్రంగానే ఉందని ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన ఎంపీపీ ఉపఎన్నికల్లో విజయపురం, నింద్ర మండలాలు తెలుగుదేశం ఖాతాలోకి వెళ్లాయి. దీనిపైనా ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీకి కనీస బలం లేకపోయినా, వైసీపీ ఎంపీటీసీలు అందరూ ఆవైపు చేరి గెలిపించారని, అది కూడా ఓ విజయమేనా? అని ఆమె విమర్శించారు. శ్రీశైలం పాలకమండలి మాజీ చైర్మన్ చక్రపాణి రెడ్డి, మరికొందరు నేతలు కావాలనే తనకు, పార్టీకి వెన్నుపోటు పొడిచారని ఫైర్ అయ్యారు. నియోజకవర్గంలో జరిగే ప్రతి ఎన్నికల్లో పార్టీని ఓటమికి గురిచేసి, తనకు చెడ్డ పేరు తీసుకువచ్చి పార్టీ పెద్దలకు తనను దూరం చేసేలా కొందరు నేతలు ప్లాన్ చేశారని ఆమె ప్రధానంగా ఆరోపించారు. పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనూ కొందరు ప్రత్యర్థి పార్టీతో కుమ్మకు అయి తనకు వ్యతిరేకంగా రాజకీయాలు చేశారని, అందుకే గత ఎన్నికల్లో తాను ఓడిపోయానని.. ఇలాంటి వ్యక్తుల వల్లే పార్టీ అధికారానికి దూరం అయ్యిందన్నారు. దీనిపై అధిష్టానానికి విన్నవించినా చర్యలు లేకపోవడంతో రోజూ పార్టీకి దూరం అయ్యేందుకు చూస్తున్నారని నగరి నియోజకవర్గంలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది.

# నెల్లూరు రాజకీయాల్లో బిగ్ ట్విస్ట్, లైన్ క్లియర్..!!



నెల్లూరు:నెల్లూరు కేంద్రంగా రాజకీయం ఆసక్తి కరంగా మారింది. నెల్లూరు మేయర్ పీఠం కోసం కొద్ది రోజులు గా ఆసక్తి కర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి నెల్లూరు మేయర్ పదవి కైవసం చేసుకునేందుకు కొత్త ప్రణాళికలు సిద్ధం చేసింది.వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన కార్పొరేటర్లు తిరిగి వైసీపీలోకి వెళ్లారు. దీంతో, క్యాంపు రాజకీయాలు మొదలయ్యాయి. ఇదే సమయంలో మేయర్ రాజీనామా చేసారు. ఇక.. టీడీపీ నుంచి కొత్త మేయర్ ఖరారయ్యారు. మాజీ మంత్రి అనిల్ కు చెక్ పెట్టే వ్యూహంతో టీడీపీ పావులు కదుపుతోంది.నెల్లూరు నగర మేయర్ స్రవంతి తన పదవికి చేసిన రాజీనామాను జిల్లా కలెక్టర్ ఆమోదించారు. స్రవంతి రాజీనామా లేఖను తొలుత జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులకు నివేదించారు. అనంతరం కలెక్టర్ ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ హయాంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నెల్లూరులోని 54 కార్పొరేషన్ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. ఎస్టీ జనరల్ కేటగిరీలో భాగంగా ఆమె మేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు.2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో ఆమె భర్త జయవర్ధన్ అవినీతి బాగోతం బట్టబయలయ్యాక అతను రెండు పర్యాయాలు జైలు జీవితం గడిపారు. ఆమె పదవి నాలుగేళ్లు పూర్తికావడంతో ఇటీవల అవిశ్వాసం పెడుతూ కార్పొరేటర్లు నోటీసులు ఇచ్చారు. ఆమెను పదవి నుంచి దించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 18న అవిశ్వాసం పెడుతూ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.కాగా, తాజాగా జరిగిన పరిణామాలతో మేయర్ తన పదవికి రాజీనామా చేశారు. ఆమె కలెక్టర్‌కు పంపిన లేఖను ప్రభుత్వం ఆమోదించడంతో ఆమె శకం ముగిసినట్లయింది. కాగా, 18న జరగాల్సిన అవిశ్వాస సమావేశం సాధారణ సమావేశంగా జరుగుతుందని కార్పొరేషన్‌లోని కొందరు అధికారులు తెలిపారు. అయితే.. ఇప్పటికే కొత్త మేయర్ ఎవరనే అంశం పైన టీడీపీ ముఖ్య నేతలు చర్చలు చేసారు. నెల్లూరు ఎంపీతో పాటుగా మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి కొత్త మేయర్ పైన తమ అభిప్రాయాలు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.ముందుగా మహిళా నేతకు అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదన పైన చర్చ జరిగింది. అయితే.. మాజీ మంత్రి అనిల్ తో సహా వైసీపీ నేతలకు చెక్ పెట్టేందుకు రూప్ కుమార్ యాదవ్ పేరును ఖరారు చేసినట్లు సమాచారం. ముందుగా ఇంఛార్జ్ మేయర్ గా ప్రకటించి.. ఆ తరువాత పూర్తి స్థాయి మేయర్ గా చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం అవుతున్నట్లు సమాచారం.

## స్టీల్ ఫ్యాక్టరీలో పేలుడు : ఒకరు మృతి

మెదక్,మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం చెట్లగౌరారంలోని ఎంఎస్ స్టీల్ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా.. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనాస్థలికి వెళ్లేందుకు ప్రయత్నించిన కార్మికులు, గ్రామస్థులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. మృతుడికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com